


# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

MJP NEWS TELUGU

సంపుటి : 6 సంచిక : 110 పేజీలు : 8 వెల : రూ.2/- ఆదివారం 17 మే 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## పోలీసులకు లొంగిపోయిన భగీరథ

- లాయర్ల సమక్షంలో అప్పగించానన్న బండి
- నార్సింగ్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు పోలీసుల వెల్లడి



**హైదరాబాద్,మన జనప్రగతి మే 16:** పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సాయి భగీరథ్ ఎట్టకేలకు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడు భగీరథ్‌ను అడ్వకేట్ల సమక్షంలో పోలీసులకు అప్పగించారు. చట్టం మీద గౌరవంతోనే భగీరథ్‌ను పోలీసులకు మిగతా2లో...

## ఐసిసి టెర్రరిస్ట్ అబూ బిలాల్ అల్ మినుకీ హతం

- నైజీరియాతో కలసి అంతమొందించిన అమెరికా
- మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాదిని అంతమొందించినట్లు ట్రంప్ ప్రకటన




## నేడు బిజెపి డప్పుడు కళాకారుల ప్రదర్శన

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వెల్లడి




**విజయవాడ,మన జనప్రగతి మే 16:** దళితుల ఆత్మగౌరవ గుండె చప్పుడు పేరుతో బీజేపీ వినూత్న కార్యక్రమం చేపట్టిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. మే 17 ఆదివారం సాయంత్రం అంబేద్కర్ విగ్రహం సాక్షిగా డప్పు కళాకారులతో భారీ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. డప్పు ద్వారా ఆధ్యాత్మిక, సంగీత, ప్రచార కార్యక్రమాలు జరుగుతాయన్నారు. డప్పు వాయిద్యానికే మిగతా2లో...

# పేదరికం లేని సమాజామే లక్ష్యం






- స్వచ్ఛత మన జీవితోల భాగం కావాలి
- ఎక్కువమంది పిల్లలే మనకు సంపద
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

**శ్రీకాకుళం,మన జనప్రగతి మే 16:** పేదరికం లేని సమాజం చూడాలనేదే తన కోరిక అని సీఎం చంద్రబాబు అన్నారు. సమాజం మారితే స్వచ్ఛాంధ్ర సాకారమవుతుందని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు.. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసరి ఆదాయం పెంచాలనేది తన ప్రధాన లక్ష్యమన్నారు. సంపద సృష్టించి పేదవాళ్లకు పంచాలి. ఆర్థిక అసమానతలు తగ్గించాలి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చిందంటే అది అధికారుల వల్లే వస్తుంది. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రతో స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్నాం. స్వచ్ఛమైన ఆలోచనలు చేయాలి. అదే మనకు మంచి మిగతా2లో...

## కాకినాడ జిల్లాలో ఘోర ప్రమాదం

- రోడ్డు దాటుతున్న కూలీలపై దూసుకెళ్లిన టిప్పర్
- ప్రమాదంలో నలుగురు మహిళా కూలీల దుర్మరణం
- ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన డిప్యూటి సిఎం



**కాకినాడ,మన జనప్రగతి మే 16:**జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కోవూరు బ్రిడ్జి వద్ద శనివారం జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు ఉపాధి హామీ కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు దాటుతున్న కూలీలను.. టిప్పర్ లారీ బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి హామీ పనుల నిమిత్తం కూలీలు రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన ఓ టిప్పర్ లారీ వారిపైకి దూసుకెళ్లింది. లారీ వేగాన్ని నియంత్రించలేక పోవడంతోనే ఈ ఘోర ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. చనిపోయిన కూలీలు.. సత్యవతి, కృష్ణమ్మ, చిట్టెమ్మ, అన్నవరంగా గుర్తించారు. వీరంతా స్థానిక చీడిగ ప్రాంతానికి చెందినవారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం కాకినాడ మిగతా2లో...



## నెదర్లాండ్స్ పర్యటనలో ప్రధాని మోడీ

- మోడీకి ప్రవాసభారతీయులు ఘన స్వాగతం
- సెమి కండక్టర్ల విషయలంఓ భారత్ దూసుకెళ్తోందని వెల్లడి
- యూనికార్న్ సంస్థలు వందకు చేరాయని ప్రకటన
- మన సంస్కృతీసంప్రదాయాలు చిరస్మరణీయమని కితాబు

**న్యూఢిల్లీ,మన జనప్రగతి మే 16:** సెమీకండక్టర్ల విషయంలో భారత్ కీలక ముందడుగు వేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మిగతా2లో...

## నీట్ పేపర్ లీక్ వ్యవహారం.. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించండి

- మోడీని డిమాండ్ చేసిన రాహుల్



**న్యూఢిల్లీ,మన జనప్రగతి మే 16:** సంచలనం సృష్టించిన 'నీట్' ప్రశ్నాపత్రం లీక్‌కు సంబంధించి కేంద్రంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ శనివారంనాడు విమర్శలు కొనసాగించారు. తక్షణం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. మిగతా2లో...




బుల్లెట్ బండి ఎక్కిన చంద్రబాబు

## కూటమి పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం : వైఎస్ జగన్



**అమరావతి,మన జనప్రగతి మే 16:**కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థికవ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైందని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. పాలనలో కేవలం అవినీతి, డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమే కనిపిస్తున్నాయని విమర్శించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధిరేటు 10.75 శాతంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారని, ఒకవేళ అదే నిజమైతే ప్రభుత్వ ఆదాయ వృద్ధిరేటు ఎందుకు 3.22 శాతానికి పడిపోయిందని జగన్ ప్రశ్నించారు. రాష్ట్రం నిజంగానే మిగతా2లో...

## 20న రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్

- ఆన్‌లైన్ మెడికల్ దందాకు వ్యతిరేకంగా నిర్ణయం




**విజయవాడ,మన జనప్రగతి మే 16:**మే 20న రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్ కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా బందుకు డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ ఇండియా వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపునిచ్చింది.. కోవిడ్ సమయంలో వచ్చిన ఆదేశాలను అడ్డంగా పెట్టుకుని అక్రమ దందా జరుగుతుందని ఆరోపించింది. ఆన్‌లైన్ బిజినెస్ లో నకిలీ మందులతో పాటు ప్రమాదకరమైన మందులు సరఫరా అవుతున్నాయని అసోసియేషన్ పేర్కొన్నది.. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఆన్‌లైన్ సేవలకు ఫుల్ స్టాప్ పెట్టాలని అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది. దీనివల్ల సామాన్య ప్రజలు మందులు కొనుగోలు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. ఆన్‌లైన్‌లో మందులు విక్రయించే ఈ-ఫార్మసీ మిగతా2లో...

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
17 -05-2026

# పేదరికం లేని సమాజామే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తుంది. అలవాట్లు మారాలి.. తద్వారా సమాజం మారుతుంది. గత 16 నెలలుగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర నిర్వహిస్తున్నాం. వ్యర్థాల నుంచి కరెంట్ ఉత్పత్తి చేస్తున్నాం. ఒకప్పుడు నా పాదయాత్రల సమయంలో చెత్తే ఎక్కువ కనిపించేది. చెత్త నుంచి సంపద సృష్టించడానికి పార్కులు ఏర్పాటు చేశాం. సింగిల్ యూజ్ ఎ÷-లాస్టిక్‌ను నిషేధించాలి. గత 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో మన పిల్లల కు 24 లక్షల ఉద్యోగాలు వస్తాయి. విశాఖకు గూగుల్ తీసుకొచ్చాం. పరిశ్రమలతో ఉత్తరాంధ్రకే వలసలు రావాలని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పాం. పిల్లలే సంపద అని ఇవాళ చెబుతున్నా. మూడో బిడ్డ పుట్టిన వెంటనే రూ.30 వేలు ఇస్తాం. నాలుగో బిడ్డ పుడితే.. రూ.40 వేలు ఇస్తాం. పిల్లలు భారమనుకోకూడదు.. వాళ్లే సంపద అని గుర్తించాలి.

తల్లికి వందనం కింద రూ.15 వేలు అందిస్తున్నాం. భగవంతుడు కరుణిస్తే.. ఈ మొత్తాన్ని పెంచుతాం అని అన్నారు. గత ఐదేళ్లు గొడ్డలి పార్టీ చేసిన అరాచకం చూశాం. ప్రజల ఆస్తుల స్నీ మార్చేసి గందరగోళం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల భూముల జోలికి ఎవరూ రాకుండా చర్యలు చేపట్టాం. భూ తగాదాలు లేకుండా చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిది.

# కాకినాడ జిల్లాలో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో మృతుల గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి పొంగూరు నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం పనులకు వెళ్తున్న నలుగురు మహిళా కూలీలు ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద ఘటనపై సమాచారం అందిన వెంటనే మంత్రి నారాయణ స్థానిక అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ఎలాంటి లోటు రాకుండా, తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని, వైద్య అధికారులను ఆయన ఆదేశించారు.

ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి నారాయణ భరోసా ఇచ్చారు. ఘోర రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో నలుగురు మహిళా ఉపాధి హామీ శ్రామికులు మృతి చెందడం బాధాకరమని అన్నారు. చీడిగ గ్రామానికి చెందిన ఆరుగురు మహిళా శ్రామికులు రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు చెప్పారని డిప్యూటీ సీఎం తెలిపారు. పని ప్రదేశంలో ఇలాంటి విషాదకర ఘటన జరగడం తీవ్రంగా కలచివేసిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కాకినాడ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు వెల్లడించారు. బాధితులు పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని చెప్పారు.

మృతి చెందిన శ్రామికుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం పెంచిన పరిహారం రూ.4 లక్షలను త్వరితగతిన అందజేస్తామని తెలిపారు. లాగే రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.2 లక్షల సహాయంతో పాటు పీఎం సురక్ష యోజన, పీఎం జీవన్ జ్యోతి యోజన కింద లభించే బీమా మొత్తాన్ని కూడా అందిస్తామని పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా రహదారుల పక్కన జరుగుతున్న ఉపాధి పనుల వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ రహదారులు, బైపాస్ రోడ్లు, ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించారు.

# నెదర్లాండ్స్ పర్యటనలో ప్రధాని మోడీ

(మొదటి పేజీ తరువాయి)

డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశం లోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రధానికి ఘనస్వాగతం లభించింది. ప్రవాస భారతీయులతో కరచాలనం, మాటామంతీ నిర్వహించారు. నెదర్లాండ్స్ నాయకత్వంతో ఎప్పుడు మాట్లాడినా ప్రవాస భారతీయులను ఎంతో ప్రశంసించేవారని ప్రధాని గుర్తు చేసుకున్నారు. హేగ్ నగరం భారతీయ స్నేహానికి సజీవ చిహ్నంగా మారిందన్నారు. కాలం మారినా.. భారతీయ సంస్కృతి మారలేదని కొనియాడారు. ఈ సందర్భంగా ఈయూ దేశాలనుద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. నెలకు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నాయి. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవి. ఇప్పుడు 100కిపైగా ఉన్నాయి. భారత్‌లో సెమీ కండక్టర్ ప్లాంట్ల పనులు జరుగుతున్నాయి. మేడిన్ ఇండియా చిప్‌లు తయారవు తున్నాయి. ఏఐ సమ్మిట్, జీ20 సమావేశాలను విజయవంతంగా నిర్వహించగలిగాం. భారత్‌లో 90 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో 64 కోట్ల మంది ఓటు వేశారు.

ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపి స్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు. నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతు న్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ వారితోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు వారితోనే ఉన్నాయి. కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగ య్యాయనే వాస్తవానికి మానవ చరిత్రే సాక్ష్యం. కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన ప్రజల హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారాయి, దేశాలు మారాయి, పరిసరాలు మారాయి, కానీ కుటుంబ విలువలు, మనం ఒక సమూహానికి చెందినవా రమనే భావన ఎన్నడూ మారలేదు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. దశాబ్దాల తర్వాత భారత దేశంలో సంపూర్ణ మెజారిటీతో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను ఆగనివ్వదు, అలసిపోనివ్వదు' అని చెప్పుకొచ్చారు.

# 20న రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్

(మొదటి పేజీ తరువాయి)

కంపెనీలకు వ్యతిరేకంగా ఈ సమ్మె జరుగుతోంది. సరైన పరీక్షలు చేయకుండానే ఆన్‌లైన్ ఎలాట్‌ఫామ్‌లలో మందులు అమ్ముతున్నారని, ఇది రోగుల భద్రతకు పెద్ద ముప్పుగా పరిణమించవచ్చని ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ చెబుతోంది. అనేక ఈ-ఫార్మసీ వెబ్‌సైట్లు సరైన వైద్య ధృవీకరణ లేకుండా మందులను పంపిణీ చేస్తున్నాయని ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ ఆరోపిస్తున్నాయి. పాత ప్రిస్క్రిప్షన్‌లను తరచుగా తిరిగి వాడుతున్నారు, ఇప్పుడు, ఏఐ సాంకేతికతతో, మందులను కొనుగోలు చేయడానికి నకిలీ ప్రిస్క్రిప్షన్‌లను సృష్టించవచ్చు. ఇది యాంటీబయాటిక్‌ల దుర్వినియోగం, వ్యసనపరులైన మందుల దుర్వినియోగంలో వేగవంతమైన పెరుగుదలకు దారితీయవచ్చు, ఇది భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కారణం కావచ్చు. అంతేకాకుండా, ఆన్‌లైన్ ఎలాట్‌ఫారమ్‌లలో మందులను భారీ తగ్గింపులకు అమ్మడం చిన్న దుకాణదారుల వ్యాపారాలను తీవ్రంగా దెబ్బతీస్తోంది. స్థానిక వైద్య దుకాణాలపై ప్రజలు ఆధారపడే గ్రామాలు, చిన్న పట్టణాలలో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, అనేక చిన్న మందుల దుకాణాలు మూతపడవచ్చని, దీనివల్ల మందుల లభ్యతపై ప్రభావం పడుతుందని ఏఐఓసీడీ పేర్కొంది.

# బుల్లెట్ బండి ఎక్కిన చంద్రబాబు




**శ్రీకాకుళం,మన జనప్రగతి మే 16:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేటలో పర్యటించారు. 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజావేదిక సమీపంలోని స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 'స్వర ఆర్ట్ గ్యాలరీ'లో గిరిజనులు ప్రత్యేకంగా రూపొందించిన ఓవర్‌కోట్‌ను ఆయన కొనుగోలు చేసి ధరించారు. అనంతరం శ్రీకాకుళం జిల్లాలో పోలీసులు ఏర్పాటు చేసిన 'హెల్మెట్ బ్యాంక్'ను సందర్శించారు. పోలీసులను అభినందించిన సీఎం హెల్మెట్ ధరించి బుల్లెట్ వాహనం ఎక్కారు. ఆయన వెంట కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు ఉన్నారు.

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు.. భారత యువతను చూసి గర్విస్తున్నా : సీజేఐ సూర్యకాంత్



**న్యూఢిల్లీ,మన జనప్రగతి మే 16:** కొందరిని తాను పరాన్నజీవులుగాలేదా బొద్దింకలుగా పోల్చిన వివాదంపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందించారు. ఒక కేసు విచారణ సందర్భంగా తాను మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని చెప్పారు. నకిలీ సర్టిఫికెట్‌లు, బోగస్ డిగ్రీలతో మీడియాలోకి, న్యాయవ్యవస్థలోకి, ఇతర వృత్తుల్లోకి ప్రవేశించేవారిని ఉద్దేశిస్తూ తాను ఈ వ్యాఖ్యలు చేశానని అన్నారు. అలాంటి వారే మీడియా (వీవఃఖు), సోషల్ మీడియాతోపాటు ఇతర రంగాల్లోకి చొరబడ్డారని అన్నానని చెప్పారు. అలాంటి వారినే తాను పరాన్నజీవులుగా పేర్కొన్నట్లు తెలిపారు.కానీ మీడియాలో కొందరు తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన సీజేఐ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయ యువతపట్ల తాను ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. శుక్రవారం ఓ కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను మీడియాలోని ఒక వర్గం వక్రీకరించిన తీరును చదివి తాను ఆవేదన చెందానని చెప్పారు. మన దేశ యువతను విమర్శించానని చెప్పడం పూర్తిగా నిరాధారమని అన్నారు. మన దేశ యువతను చూసి తాను ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. తనపట్ల భారత యువతకు గౌరవ మర్యాదలు ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని అన్నారు. యువతను దేశాభివృద్ధికి మూలస్తంభాలుగానే చూస్తానని సూర్యకాంత్ తెలిపారు.

# పోలీసులకు లొంగిపోయిన భగీరథ

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించినట్లు ఆయన తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమే.. చట్టానికి అందరూ లోబడి ఉండాల్సిందే అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ..'నా కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసు ఆరోపణలు వచ్చాయి. చట్టాలపై ఉన్న గౌరవంతో అడ్వకేట్ల ద్వారా పోలీసుల విచారణకు అప్పగించాను. నేను ఇంతకు ముందే చెప్పా.. చట్టం ముందు నా బిడ్డ అయినా, సామాన్యుడైనా సమానమే. అందరం చట్టాలకి లోబడి ఉండాల్సిందే. మా అబ్బాయి ఏ తప్పూ చేయలేదని పదేపదే చెబుతున్నాడు. వాస్తవానికి ఫిర్యాదు రాగానే స్టేషన్‌లో అప్పగిద్దామని అనుకున్నా. లాయర్లను సంప్రదించి మా వద్ద ఉన్న ఆధారాలను నా కుమారుడు వారి ముందుంచాడు. వాటిని చూసి కేసు కొట్టేస్తారని.. బెయిల్ తప్పకుండా వస్తుందని లాయర్లు చెప్పారు. అందుకే కొంత జాప్యం జరిగింది. ఈరోజు కూడా బెయిల్ వస్తుందనే లాయర్లు చెబుతున్నారు. అయితే ఇంకా జాప్యం చేయడం సరికాదని అనుకున్నా. ఆ ఉద్దేశంతో మా అబ్బాయిని తీసుకొచ్చి లాయర్ల ద్వారా విచారణ కోసం అప్పగించాను. న్యాయ వ్యవస్థపై సంపూర్ణమైన నమ్మకం ఉంది. సోమవారం నాడు కోర్టు ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నప్పటికీ.. న్యాయ వ్యవస్థపై ఉన్న గౌరవంతో ఇంకా ఆలస్యం కావొద్దని విచారణకు అప్పగించా' అని తెలిపారు. అయితే పోలీసుల కథనం మరోలా ఉంది. నార్సింగ్ పోలీస్ అకాడమీ సమీపంలో భగీరథను అదుపులోకి తీసుకున్నామని చెబుతున్నారు. అక్కడి నుంచి అతడిని పేటబషీరాబాద్ స్టేషన్‌కు తరలించామని డిసిపి రమేశ్ రెడ్డి వెల్లడించారు.

# ఐసిసి టెర్రరిస్ట్ అబూ బిలాల్ అల్ మినుకీ హతం

**వాషింగ్టన్,మన జనప్రగతి మే 16:** ఉగ్రసంస్థ ఐసిస్‌కు చెందిన మరో మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టును మట్టుపెట్టామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. నైజీరియా దళాలతో కలిసి అమెరికా దళాలు ఐసిస్ టెర్రరిస్టు అబూ బిలాల్ అల్ మినుకీని అంతం చేశాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఐసిస్ కార్యకలాపాలను పర్యవేక్షించే అతడు సంస్థలో నెం.2 నాయకుడిగా ఉండేవాడని ట్రంప్ చెప్పారు.ఆఫ్రికాలో దాక్కుంటే తనను ఎవరు ఏమీ చేయలేరని అతడు భావించాడని అన్నారు. కానీ అతడి సమాచారం తమకు నిత్యం అందుతూనే ఉందన్న విషయాన్ని మాత్రం పసిగట్టలేకపోయాడని ఎద్దేవా చేశారు. ఆఫ్రికా ప్రజలకు అతడి పీడ విరగడయ్యిందని కూడా ట్రంప్ వ్యాఖ్యానించారు. అతడి ఉగ్రనీడ తొలగిపోయిందని చెప్పారు. అబూ బిలాల్ అంతంతో ఐసిస్ గ్లోబల్ కార్యకలాపాలకు కూడా పెద్ద దెబ్బతగిలిందని చెప్పారు. ఈ మిషన్‌లో అమెరికా దళాలకు సహకరించిన నైజీరియా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అమెరికా, నైజీరియా సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అతడి మృతితో ప్రపంచవ్యాప్తంగా ఐసిస్ కార్యకలాపాలు మరింత బలహీనమవుతాయని ట్రూత్‌లో ట్రంప్ పోస్టు పెట్టారు. నా ఆదేశాల మేరకు అమెరికా బలగాలు, నైజీరియా భద్రతా బలగాలు ఐసిస్ అగ్ర కమాండర్ అబు-బిలాల్ అల్-మినూకిని మట్టుబెట్టాయి. ఐసిస్‌లో రెండో అత్యున్నత హోదాలో ఉన్న మినూకి ఆఫ్రికాలో దాక్కోగలనని భావించాడు. కానీ మా గూఢచార వర్గాలు అక్కడా ఉన్నాయనే విషయం తెలుసుకోలేక పోయాడు. ఇక అతడు ఆఫ్రికా ప్రజలను భయభ్రాంతులకు గురిచేయలేడు. అమెరికన్లు లక్ష్యంగా ఆపరేషన్లకు ప్లాన్ చేయడంలో సహకరించలేడు. అమెరికాతో కలిసి పనిచేసిన నైజీరియా ప్రభుత్వానికి థాంక్స్‘ అని ట్రంప్ రాసుకొచ్చారు. నైజీరియాలో జన్మించిన మినూకి ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ సీనియర్ కమాండర్. ఇస్లామిక్ స్టేట్ తరఫున టెర్రర్ సెల్స్‌కు సూచనలు ఇవ్వడం, అంతర్జాతీయ నిధులను దారి మళ్లించడం వంటి కార్యకలాపాల్లో పాల్గొనేవాడు. ఆ ఆరోపణలతో 2023లో అమెరికా అతడిని ఉగ్రవాదిగా గుర్తించింది.

# నేడు బిజెపి డప్పుడు కళాకారుల ప్రదర్శన

(మొదటి పేజీ తరువాయి)

జీవితాలను అంకితం చేసిన వారు ఉన్నారని గుర్తుచేశారు. మేల్కొలిపే ఈ డప్పును ఓ దళితుడు మోగిస్తారని.. ఆ తరువాత ఇతర వాయిద్యాలు ప్రారంభమవుతాయని చెప్పారు. బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షులు పనతాల సురేశ్ ఆధ్వర్యంలో డప్పు కళాకారుల కోసం ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారి బతుకుల్లో వెలుగులు ఇచ్చేలా వారి సంక్షేమం కోసం బీజేపీ కృషి చేస్తోందన్నారు.భారత రాజ్యాంగం ద్వారా అందరకీ సమాన ప్రాధాన్యం ఇచ్చిన అంబేద్కర్ నడయాడిన ప్రాంతాలను ప్రధాని మోదీ అభివృద్ధి చేశారని మాధవ్ చెప్పారు. విజయవాడలో అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ సీఎం జగన్ ఏర్పాటు చేశారని అందరూ అనుకుంటారని.. అది నిజం కాదని స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం రూ.430 కోట్లు కేటాయించి నిర్మాణం చేసిందని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలు ప్రజల్లోకి వెళ్లేలా రేపు(ఆదివారం) డప్పు కళాకారుల ప్రదర్శనలు ఉంటాయన్నారు. 'చదవండి.. సమీకరించండి.. పోరాడండి అని అంబేద్కర్ చెప్పారు. చదువు ద్వారా సమాజంలో గుర్తింపు ఉంటుందని చెప్పారు' అని గుర్తుచేశారు. రేపు పెద్ద ఎత్తున జరిగే ఈ ప్రదర్శనలో మంత్రి సత్యకుమార్, కూటమి నాయకులు పాల్గొంటారని మాధవ్ తెలిపారు. డప్పు కళాకారులకు చేయూతనివ్వాలని.. ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అన్ని కులాల వారికి ఆలయాల్లో సమాన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దేవాలయ వ్యవస్థలో అన్నివర్గాల వారి పాత్ర ఉంటుందని తెలిపారు. డప్పు కళాకారులు ప్రతి ఉత్సవంలో కీలకంగా పని చేస్తారన్నారు. రేపు జరిగే భారీ ప్రదర్శన సరికొత్త చరిత్రకు నాంది పలుకుతుందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

# నీట్ పేపర్ లీక్ వ్యవహారం ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నాపత్రాల లీకేజీతో 22 లక్షల మంది నీట్ విద్యార్థులు నష్టపోయారని, అయినప్పటికీ ప్రధాని దీనిపై పెదవి విప్పడం లేదని విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణం తొలగిస్తారా? స్వయంగా ప్రధానమంత్రే ఇందుకు బాధ్యత వహిస్తారా? అని ప్రశ్నించారు. 'మోదీ జీ... ధర్మేంద్ర ప్రధాన్‌ను ఇప్పుడే తొలగించండి' అని ఆ ట్వీట్‌లో రాహుల్ పేర్కొన్నారు. వైద్యకళాశాలల్లో అడ్మిషన్ల కోసం మే 3న నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రన్స్ పరీక్షలో అవకతవకలు వెలుగుచూడటంతో దీనిని రద్దు చేశారు. దీంతో దేశంలోని నలుమూలల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. జూన్ 21 తిరిగి పరీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై రాహుల్ విమర్శలు గుప్పిస్తూ, నీట్ పరీక్షల కోసం రెండేళ్ల పాటు 22 లక్షల మంది విద్యార్థులు రేయింబవళ్లూ కష్టపడ్డారని, వారి కఠోర శ్రమ బూడిదలో పోసిన పన్నీరయిందని అన్నారు. పరీక్షలకు రెండ్రోజుల ముందే నీట్ పేపర్ వాట్సాప్‌లో డిస్ట్రిబ్యూట్ అయిన విషయం యావద్దేశానికి తెలుసునని చెప్పారు. దీనితో తనకెలాంటి సంబంధం లేదని ధర్మేంద్ర ప్రధాన్ చెబుతున్నారని అన్నారు.

# కూటమి పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం : వైఎస్ జగన్

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి చెందితే దానికి అనుగుణంగా ప్రభుత్వానికి వచ్చే రెవెన్యూ కూడా పెరగాలి కదా అని నిలదీశారు.వైసీపీ పాలనలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో పన్నుల ద్వారా రాష్ట్రానికి రూ.85,922.23 కోట్ల ఆదాయం వచ్చిందని జగన్ గుర్తుచేశారు. గడిచిన రెండేళ్లలో సాధారణంగా ఉండాల్సిన 8 శాతం వృద్ధి రేటును పరిగణనలోకి తీసుకున్నా 2025-26 నాటికి ఈ పన్నుల ఆదాయం రూ.1,00,219.69 కోట్లకు చేరాల్సి ఉందన్నారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో వాస్తవంగా వచ్చింది కేవలం రూ.86,552.68 కోట్లు మాత్రమేనని చెప్పారు. ఈ లెక్కల ప్రకారం అంచనాల కంటే దాదాపు రూ.13,667 కోట్ల మేర రాష్ట్ర ఆదాయం తగ్గిపోవడాన్ని చంద్రబాబు ప్రభుత్వం 'సంపద సృష్టి' అని ఎలా పిలుస్తుందని జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
17 -05-2026

# టోల్‌గేట్ వద్ద బ్లాక్ స్పాట్స్ పరిశీలన





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 16:-** కర్నూలు జిల్లా పంచలింగాల టోల్‌గేట్ వద్ద బ్లాక్ స్పాట్స్ పరిశీలన యాత్ర బస్సు ప్రారంభించారు. శనివారం కర్నూలు జిల్లా పంచలింగాల టోల్‌గేట్ వద్ద నిర్వహించిన బ్లాక్ స్పాట్స్ పరిశీలన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు.బ్లాక్ స్పాట్స్ పరిశీలన యాత్ర బస్సును జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పంచలింగాల టోల్‌గేట్ పరిసర ప్రాంతాల్లో గుర్తించిన ప్రమాదకర ప్రాంతాలను పరిశీలించి, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు, మరియు హైవే అధికారులకు పలు సూచనలు చేశారు.రోడ్డు భద్రత విషయంలో నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలకు కారణమయ్యే అంశాలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. ముఖ్యంగా బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ నియంత్రణ చర్యలు, సరైన లైటింగ్, రహదారి గుర్తులు ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రజలు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా టీజీ వెంకటేష్ పుట్టినరోజు వేడుకలు




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 16:-** మాజీ రాజ్యసభ సభ్యులు టీ.జీ .వెంకటేష్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం పుట్టినరోజు కేక్ కట్ చేసి తైక్వాండో క్రీడకారులు పండగ చేసుకున్నారు. ఉదయం కిడ్స్ వరల్డ్ లో కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కర్నూలు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రామాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తైక్వాండో చిన్నారులకు పరిచయం చేసుకొని కేక్ కట్ చేసి టిజి. వెంకటేష్ పుట్టినరోజు టీజీవి,టిజిబి తైక్వాండో అకాడమీ నాయకులుబి. రామాంజనేయులు మాట్లాడుతూ అకాడమీ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ, యూనివర్సిటీలో కూడా ఎన్నో పథకాలు సాధిస్తున్నారు అన్నారు. ఈ అకాడమీకి ప్రత్యేకతంగా అభినందించారు.వ్యవస్థాపకులు టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థి విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని చాలా సంతోషం వ్యక్తం చేశారు టీజీ వెంకటేష్,మంత్రి టీ.జీ భరత్ కర్నూలు నగరంలో ఎటువంటి సేవలకైనా ముందుంటారు. క్రీడలకు, షాది ఖానా, లకు మినరల్ వాటర్ కు టీజీ వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా వందల మందికి పెళ్లిళ్లు చేయడం టీ.జీ. వెంకటేష్ కుటుంభం ముందుంటారు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ హక్కుల ఐక్యవేదిక ఫిట్నెస్ సెల్ డిఫెన్స్ అకాడమీ వ్యవస్థాపకులు టి. అజయ్,బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ కర్నూలు జిల్లా కార్యదర్శి టి. తేజ, నేషనల్ ప్లేయర్ విశ్వాసరావు,తిలక్, అఖిల్, సాయి కృష్ణ, నందిని, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## జననగణన గడువులోపు పూర్తి చేయండి: ఇంచార్జి కమిషనర్ శారదా దేవి



**తిరుపతి మన జనప్రగతి మే 16:-**జననగణన 2027 ను గడువు లోపు పూర్తి చేయాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులు, సిబ్బందికి సూచించారు. జనన గణన 2027 లో బాగంగా ఇంటింటి నుండి సమాచారాన్ని సేకరించే విధానాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఆప్ ద్వారా ఏయే వివరాలను ఎలా నమోదు చేస్తున్నారనే విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జనన గణన సమాచార సేకరణ ఆలస్యం అవుతోందని తెలిపారు. జననగనణ చేసేందుకు 625 మంది ఎన్యుమరేటర్లు, 71 మంది సూపర్ వైజర్లు, 21 మంది ఫీల్డ్ ట్రైనర్లు ఉన్నారని వారందరికీ టార్గెట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. అయినా ఎందుకు ఆలస్యం అవుతోందని ప్రశ్నించారు. ఇది ఏమైనా మీకు ఇచ్చిన గడువు లోపు పూర్తి చేయాలని తెలిపారు. ఈ జననగణన లో ఎక్కడా పొరపాట్లు జరగకుండా అన్ని వివరాలు యాప్ లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి మధుసూదన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు కరుణాకర్, మోహన్, తదితరులు ఉన్నారు.

# సమస్యలు ఉంటే 1098కాల్ చెయ్యండి: ఐసిడిఎస్,సిడిపీఓ,శాంతమ్మ



**చెన్నూరు మన జనప్రగతి మే 16:-** చెన్నూరు నందు కిశోరి వికాసం వేసవి సెలవుల కార్యక్రమం శనివారం నిర్వహించడం అయినది . ఈ కార్యక్రమంలో భాగంగా సీడీపీఓ శాంతమ్మ మాట్లాడుతూ పిల్లలకు ఏదైనా సమస్యలు ఎదురైనప్పుడు 1098కి కాల్ చేయాలి, అలాగే పిల్లలకు తల్లిదండ్రులు కానీ బంధువులు కానీ బాల్యవివాహం చేయదలచినారు అని తెలిసిన వెంటనే 1098 కి కాల్ చేయవచ్చు అలాగే ఎవరైనా పిల్లల్ని టీజ్ చేస్తున్న లేదా చైల్డ్ అబ్యూజ్ కి పాల్పడిన ఇదే నెంబర్ కి కాల్ చేసి చెప్పవచ్చు మీకు వచ్చే సమస్యలను సమర్థవంతంగా మరియు ధైర్యంగా ఎదుర్కోవాలి అని POCSO యాక్ట్, బాల్య వివాహాలు, బాలబాలికల భద్రత, దివ్యాంగుల హక్కులు శక్తియాప్ గురించి అవగాహన కల్పించడ మైనదిఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సీడీపీఓ శాంతమ్మ గారు, ఐసిడియస్ సూపర్వైజర్ గుర్రమ్మ మరియు ఐసిపిఎస్ నందు సోషల్ వర్కర్ గా పనిచేస్తున్న లక్ష్మీ ప్రసన్న మరియు ,అంగన్వాడి కార్యకర్తలు కిశోర బాల బాలికలు పాల్గొనడం అయినది.

# టి.జి.వి భవన్‌లో తలసేమియా కేంద్రము ఏర్పాటుకు కోటి రూపాయల విరాళం

### రూ 25 లక్షల చెక్ అందజేత

### కర్నూలు అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నాం: మంత్రి టి.జి.భరత్ గుప్తా





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 16 :-** కర్నూలు అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ ఉన్నామని మంత్రి టి. జి.భరత్ తలసేమియా కేంద్రం టి జి వి భవన్ లో ఏర్పాటు కు నిర్మాణ భూమి పూజ సందర్భంగా పేర్కొన్నారు.శనివారం ఉదయం కర్నూలు బ్లడ్ బ్యాంక్ ఆవరణలో దాదాపు ఒక కోటి 50 లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించ తలపెట్టిన టి.జి. వెంకటేష్ భవన్ లో తల సేమియా (రక్త మార్పిడి చేయుటకు ) కేంద్రాని కి పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ గుప్త మరియు కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు భూమి పూజ నిర్వహించారు , జ్యోతి ప్రజ్వలన గావించి శిలాఫలకాన్ని సంయుక్తంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి టి. జి.భరత్ గుప్త మాట్లాడుతూ కర్నూలు అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ ఉన్నామని తెలిపారు. గెలుపు ఓటమిలకు సంబంధం లేకుండా రాజకీయాలకు సంబంధం లేకుండా కర్నూలు అభివృద్ధికి ఎల్లవేళలా మా కుటుంబం ముందుగా ఉంటుందని తెలిపారు. ఈరోజు మా తండ్రి మాజీ మంత్రి , మాజీ పార్లమెంటు సభ్యులు టి.జి.వెంకటేష్ గారి జన్మదిన సందర్భంగా ఒక మంచి పని చేయాలన్న ఉద్దేశంతో మా టి.జి. వి గ్రూప్ నుండి ఒక కోటి రూపాయల విరాళం ఈ టి జి వి భవన్ లో తల సేమియా కేంద్రానికి ప్రకటించడం మరియు అందులో భాగంగా ప్రస్తుతం 25 లక్షల రూపాయల చెక్కును కర్నూలు బ్లడ్ బ్యాంక్ కు చెందిన రెడ్ క్రాస్ సొసైటీకి అందించామని తెలిపారు. ఈ టి జి వి భవన నిర్మాణాన్ని మూడు నెలల లోగా పూర్తి చేయాలని నిర్వాహకులను మంత్రి కోరారు.మా కుటుంబం ప్రజాసేవలో భాగంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ఉంటుందని ముఖ్యంగా కళ్యాణ మండపాలు,మినరల్ వాటర్ ప్లాంట్లు , క్రీడా ప్రాంగణాలు మరియు ఇప్పుడు తల సేమియా కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.సొంత నిధులతో కర్నూలు సర్వజన ఆసుపత్రిలో పలు కార్యక్రమాలు చేస్తూ కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిగా మారుస్తున్నామని , మా భాగస్వామ్యంతో మరియు మెడికల్ కాలేజీ పూర్వపు విద్యార్థులతో 70 సెంట్ల స్థలం లో దాదాపు 60 కోట్ల రూపాయలతో నాలెడ్జ్ సెంటర్ భవనము ఏర్పాటు మొదలగు కార్యక్రమాలు చేస్తూ ఉన్నామని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ గోవింద్ రెడ్డి సేవ చేయాలన్న తపనతో నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్నందుకు ఆయనను అభినందిస్తున్నానని మంత్రి తెలిపారు. కర్నూలు ప్రజలు ఎల్లప్పుడూ మా కుటుంబాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ , డి ఎం హెచ్ ఓ కామేశ్వర ప్రసాద్ , రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కేజీ గోవిందరెడ్డి , ఇంజనీరింగ్ కాలేజ్ అధినేత కె.వి.సుబ్బారెడ్డి ,మెడికల్ ఆఫీసర్లు డాక్టర్లు రామచంద్రారావు , శ్రీనివాసులు, కుమారస్వామి రెడ్డి , రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు , బ్లడ్ డోనర్స్ , మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా “మెగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ డే ”

### మాదకద్రవ్యాలను పూర్తిగా అరికట్టే దిశగా “ఆపరేషన్ వజ్రప్రహార్” లో భాగంగా విస్తృత తనిఖీలు





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 16:-**జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం “ఆపరేషన్ వజ్రప్రహార్” లో భాగంగా రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఈగల్ ఐజి ఆకే రవి కృష్ణ పర్యవేక్షణలో, కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని పోలీసు సబ్ డివిజన్‌లలో శనివారం మెగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ విస్తృతంగా నిర్వహించారు. పత్తికొండ సబ్ డివిజన్ -వెల్దుర్తి గ్రామం లో,ఎమ్మిగనూరు సబ్ డివిజన్ నందవరం పీఎస్ పరిధిలో ని - కనకవీడు గ్రామంలో,ఆదోని సబ్ డివిజన్ - కౌతాళం పీఎస్ పరిధిలో ని కుప్పగల్ గ్రామంలో,కర్నూలు సబ్ డివిజన్ - కర్నూల్ తాలుకా పియస్ పరిధిలోని వెంకన్నబావి, దిన్నెదేవరపాడు, అంబేద్కర్ నగర్ ప్రాంతాలలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ లు నిర్వహించారు.మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా మరియు సంబంధిత నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు. డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు , స్పెషల్ టీం లు, పోలీసు సిబ్బంది మొత్తం162 మంది పాల్గొన్నారు. హాట్ స్పాట్ ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. 500 ఇళ్ళను తనిఖీలు చేశారు. 2,500 మంది ని తనిఖీలు చేశారు.120 వాహనాలను తనిఖీలు చేశారు.సరైన పత్రాలు లేని 42 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వెల్దుర్తి పియస్ పరిధిలో 42 సారా ప్యాకెట్లను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు.మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య,సామాజిక,చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు.ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ప్రజలతో కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేయించారు.సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా పోలీసు అధికారులు పేర్కొన్నారు.మాదకద్రవ్యాల ను పూర్తిగా అరికట్టే దిశగా “ఆపరేషన్ వజ్రప్రహార్” లో భాగంగా ఇలాంటి దాడులు నిరంతరం కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు.ప్రజల సహకారంతో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.పత్తికొండ డిఎస్పీ వెంకట్రామయ్య, ఎమ్మిగనూరు డిఎస్పీ భార్గవి , కర్నూలు ఇన్చార్జి డిఎస్పి ఉపేంద్ర బాబు, సిఐలు, ఎస్సైలు , స్పెషల్ టీం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తెల్లారిన ఉపాధి కూలీల బతుకులు

### ● కాకినాడ రూరల్ కొవ్వూరులో ఘోర రోడ్డు ప్రమాదం ● నలుగురు మృతి- ఇద్దరికి తీవ్ర గాయాలు



**కాకినాడ మన జనప్రగతి మే 16:-**కాకినాడ రూరల్ కొవ్వూరు బైపాస్ రోడ్లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు ఉపాధి మహిళా కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు మహిళ కూలీలకు తీవ్ర గాయాలు అయ్యాయి. శనివారం తెల్లవారు జాము ప్రాంతంలో అత్యంత వేగంతో టిప్పర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. అలాగే ఆ సమయంలో టిప్పర్ డ్రైవర్ మందు తీసుకున్నాడని తెలియజేశారు. కూలీలకు హాజరుకు ఉపయోగించే ఫేస్ యాప్కు నెట్ అందకపోవడంతో పనులు చేసుకుంటున్న వారిని ఫీల్డ్ అసిస్టెంట్ నమోదు కోసం రోడ్డు పక్కకు పిలిచినట్లుగా వారు చెప్పారు. 20 మంది పూర్తయిన తర్వాత వారు వెళ్లిపోగా మిగిలిన ఆరుగురికి యాప్ స్కాన్ చేస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు అక్కడి స్థానికులు చెప్పారు. ఈ ప్రమాదంలో చీడిగ ప్రాంతానికి చెందిన వాసంశెట్టి సత్యవతి, పాలిక కృష్ణవేణి, కాదా చిట్టెమ్మ, చెల్లూరి అన్నవరంలు మృతిచెందగా పాలిక నాగమణి, మట్టపర్తి అరుణ కుమారిలకు గాయాలయ్యాయి. ఉదయమే ఈ ప్రమాదం జరగడంతో ఈ వార్త దాహంలో చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించింది. గత మూడు నెలల కాలంలో కేవలం హైవే ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోయిన అనేక కుటుంబాలు వీధిన పడ్డాయి. కాకినాడ చుట్టుపక్కల గ్రామాల కూడలి హైవేగా మారడం గ్రామాలకు ఆనుకుని ఉన్నాయి. ఈ హైవే అరకొరగా పూర్తయిన రవాణా సౌకర్యానికి వీలు లేకపోయినా భారీ వాహనాలు ఈ రహదారిపై రాకపోకలు నిర్వహించడం వల్ల అవగాహన లోపం వల్ల అధికారుల నిర్లక్ష్యం వల్ల అనేక పేద కూలి పని చేసుకునే కుటుంబాలు రోడ్డును పడుతున్నాయి ప్రమాదాల బారినపడి రోడ్డును పడుతున్నాయి.రోడ్డు భద్రత భవనాల శాఖ అధికారులు ఈ హైవేలపై పర్యవేక్షణ లోపం ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోవడం హైవేపై జీబ్రా క్రాసింగ్లు వంటివి ఏర్పాటు చేయకపోవడం వల్ల హైవే రహదారిపై భారీ ప్రమాదాలు జరుగుతున్నవి. జిల్లా పోలీసులు గ్రామాల అనుకుని ఉన్న హైవేలపై ఏర్పాటు చేసిన పెట్రోలింగ్ వాహనాలు సక్రమంగా పనిచేయకపోవడం వల్ల ఎప్పటికప్పుడు నేత్రాలు పర్యవేక్షణ లోపం వల్ల రాత్రులు తెల్లవారులు రాత్రి సమయాలలో భారీ వాహనాలు అత్యంత వేగంతో ఈ రహదారులపై రాకపోకలు నిర్వహించడం తెల్లవారుజామున అదే వేగంతో రావడం వల్ల ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నావని స్థానికులు తెలుపుతున్నారు. హైవేలపై పోలీస్ హైవే పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో ఉండేలా జిల్లా పోలీసు వారు సహకరించాలని అనేకమంది కోరుతున్నారు. భారీ వాహనాలు అలాగే లారీలు టిప్పర్లు వంటి ఇసుక మట్టి గ్రావెల్ వంటివి రాత్రులు రవాణా చేస్తున్న వాహనాలపై రవాణా శాఖ అధికారులు పట్టించు కోకపోవడం రాత్రి సమయాలలో వాహనాలను తనిఖీలు చేయకపోవడం వల్ల కనీసం లైసెన్సు ఇన్సూరెన్స్ లేని వాహనాలు హైవేలపై అత్యంత వేగంతో తిరుగుతూ ప్రమాదాలు చేస్తున్నారని హైవే ని ఆనుకుని ఉన్న గ్రామస్తులు తెలుపుతున్నారు ఎప్పటికైనా రవాణా శాఖ వారు మేల్కొని రాత్రి సమయాలలో తిరిగే వాహనాలను తనిఖీలు చేసి సురక్షితంతో కూడిన వేగంతో రవాణా సౌకర్యాలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని రవాణాశాఖ అధికారులను కోరుతున్నారు. ప్రతి సంవత్సరం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రమాదాల శాతం తగ్గిందని పేపర్ పై చెప్పడమే తప్ప ప్రతినెల హైవేలపై అనేక ప్రమాదాల బారిన పడి అనేక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని దీనిపై పోలీసు వారు ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రమాదాలు నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని హైవేలకు ఆనుకుని అనుసంధానంగా ఉన్న గ్రామస్తులు జిల్లా ఎస్పీని కోరుతున్నారు. మృతులంతా పేదలు, వ్యవసాయ కార్మికులు కావడంతో వారి కుటుంబాలలో తీవ్ర విషాదం నెలకొంది.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
17 -05-2026

## ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన ఎంపీడీఓ శ్రీనివాస రెడ్డి



**సింహాద్రిపురం మన జనప్రగతి మే 16:** మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ )శ్రీనివాస రెడ్డి శనివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈరోజు ఆయన సుంకేసుల, లోమడ,మరియు తెలికి గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఆయన కూలీల హాజరు,మస్టర్లు మరియు పని ప్రదేశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం యన్ యం యం ఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం )యాప్ ద్వారా హాజరు నమోదు చేయడంలో ఎటువంటి సాంకేతిక సమస్యలు లేవు.కాబట్టి గ్రామీణ ప్రాంతాల్లోని శ్రామికులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డీ పేరుకొన్నారు.అర్హులైన కూలీలందరూ ఉపాధి పనులకు హాజరై,ప్రభుత్వం కల్పిస్తున్న ఈ పథకం ద్వారా ఉపాధి పొందాలని ఆయన కోరారు. ఈ తనిఖీలో స్థానిక ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు కూలీలు పాల్గొన్నారు.

## వైసిపి సంయుక్త కార్యదర్శిగా మలిశెట్టి వెంకటరమణ



**చిట్వేలి మన జన ప్రగతి మే 16:-** వైసిపి రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా తనను నియమించినట్లు చిట్వేలి మండలానికి చెందిన వైసిపి నాయకులు మలిశెట్టి వెంకటరమణ శనివారం తెలియజేశారు. పార్టీ నా సేవలను గుర్తించి పదవి ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డికి, రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథరెడ్డికి, కోడూరు మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులుకు, చిట్వేల్ మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డికి, చిట్వేలి గ్రామ మాజీ ఉప సర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్ రెడ్డికి, నా పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని మలిశెట్టి వెంకటరమణ ఈ సందర్భంగా తెలియజేశారు.

## జనసేనకు నూతన దిశ - సమిష్టి కృషికే ప్రాధాన్యం

**- కార్యకర్తలకు మార్గదర్శకత్వం ఇచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్... హాజరైన దాసరి రవిశంకర్**



**వేంపల్లె మన జనప్రగతి మే 16:-** మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో నిర్వహించిన జనసేన ఉద్యమి ఆత్మీయ సమావేశంలో జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. జనసేన పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశానికి పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకుడు దాసరి రవిశంకర్, టి.నాగ మల్లికార్జున లు హాజరయ్యారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమాలపై నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. పార్టీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పులివెందులలో రూ.10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**● బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం: జడ్పీటిసి మారెడ్డి లతారెడ్డి**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 16:** పేద ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి అన్నారు.ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులకు ఆర్థిక భరోసా లభించింది.శనివారం పులివెందుల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ (టీడీపీ) కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు సుమారు 10 లక్షల రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మారెడ్డి లతా రెడ్డి స్వహస్తాలతో అందజేశారు.వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ,వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న బాధితులకు ఈ ఆర్థిక సాయం మంజూరైంది.ఈ సందర్భంగా చెక్కులను అందుకున్న లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు తీవ్ర భావోద్వేగానికి లోనవుతూ హర్షం వ్యక్తం చేశారు.ఆపద కాలంలో మాకు ఆర్థికంగా అండగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి,నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్న పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి కి ఎప్పటికీ రుణపడి ఉంటాం అని లబ్ధిదారుల పేర్కొన్నారు.నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా,అర్హులకు సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూస్తున్న కూటమి ప్రభుత్వానికి మరియు స్థానిక నాయకత్వానికి లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు,కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## డెంగ్యూపై అప్రమత్తతే రక్షణ

**నక్కలదిన్నెలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ,అవగాహన సదస్సు**




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 16:-** చాపాడు మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఎన్.ఒబాయపల్లె సచివాలయం పరిధి ఎన్.అనంతపురం గ్రామంలో శనివారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ పి. ఓబులేసు ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించి గ్రామ ప్రజలకు డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. ఓబులేసు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి "ఏడీస్ ఈజిప్టై" అనే దోమ ద్వారా వ్యాపిస్తుందని, ఈ జ్వరం కొన్ని సందర్భాల్లో ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని తెలిపారు. డెంగ్యూ నివారణకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో నిల్వ నీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం "ఫ్రైడే డ్రైడే" పాటిస్తూ ఇంట్లోని నీటిని పూర్తిగా పారబోసి, మళ్లీ తాజా నీటిని నింపుకోవడం వల్ల దోమలు గుడ్లు పెట్టకుండా నిరోధించవచ్చని వివరించారు. ఇలా చేయడం ద్వారా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, బోదకాలు, మెదడు వాపు, వైరల్ ఫీవర్స్ వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు.అలాగే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని గ్రామ ప్రజలకు సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. భాగంగా డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించి, గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎం. రాఘవయ్య, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ జయప్రకాష్, ఏఎన్ఎం ఆరోగ్య మేరీ, ఆశా కార్యకర్త జయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ప్రొద్దుటూరు: కలెక్టర్‌కు రాచమల్లు ఫిర్యాదు..!



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 16:-** ప్రొద్దుటూరు నియోజకవర్గంలో జరుగుతున్న భూ వివాదాలు, అక్రమ ఇసుక రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి శనివారం కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని చౌడూరు గ్రామ పరిధిలో గత 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న పేద రైతుల భూములను ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా ఏపీఐఐసీ కి అప్పగిస్తున్నారని, అలాగే బొల్లవరం పరిధిలో సుమారు రూ.150 కోట్ల విలువైన భూముల కబ్జా జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ అంశాలపై చౌడూరు గ్రామ రైతులతో కలిసి కలెక్టర్‌ను కలిసి న్యాయం చేయాలని కోరారు.అనంతరం కలెక్టర్ బంగ్లా వెలుపల ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో రాచమల్లు మాట్లాడుతూ, ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డి ప్రోత్సాహంతో గంజాయి, జూదం, క్రికెట్ బెట్టింగ్, మట్కా, గ్యాంబ్లింగ్, అక్రమ ఇసుక రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని విమర్శించారు. వీటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చౌడూరు గ్రామ రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పందించాలని, లేదంటే చట్టబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. అవసరమైతే రైతులకు వైఎస్సార్సీపీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చే వరకు అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డా. దాసరి సుధ, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, ప్రొద్దుటూరు మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, చౌడూరు మాజీ సర్పంచ్ పల్లా లక్ష్మీనారాయణ రెడ్డి, రాజుపాలెం మండల వైసీపీ నాయకుడు వెలవలి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

**● "పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ నివారణ సాధ్యం": డాక్టర్ జి. మధుకుమార్**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 16:-** పట్టణంలోని టి.బి. రోడ్డులో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సమావేశం మరియు ర్యాలీ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జి. మధుకుమార్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు.డెంగ్యూ వ్యాధి నివారణలో భాగంగా "పరిశీలించండి శుభ్రం చేయండి మూత పెట్టండి" అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఆయన సూచించారు. ప్రతి శుక్రవారం "డ్రై డే ఫ్రైడే" కార్యక్రమాన్ని అన్ని సచివాలయాల పరిధిలో నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇళ్లలో నీరు నిల్వ ఉండే తొట్లు, కుండలు, బానలు, కూలర్లు వంటి వాటిని వారానికి ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేయాలని సూచించారు. దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. డెంగ్యూ, మలేరియా సంబంధిత రక్త పరీక్షలు జిల్లా ఆసుపత్రి మరియు యూ పి హెచ్ సి కేంద్రాల్లో ఉచితంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ప్రతి ఒక్కరూ "ఫ్రైడే డ్రైడే" కార్యక్రమాన్ని పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడి ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అనంతరం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు కలిసి పట్టణ పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ ఆర్ డి సొసైటీ అధ్యక్షులు ఎం.వి. సుబ్బారెడ్డి, సభ్యులు రమణమ్మ, గంగాభవాని, ఆశా కార్యకర్తలు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించి ప్రజలను ఆదుకోవాలి



**చిట్వేలి మన జనప్రగతి మే 16:-** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నాయని చిట్వేలి మండల సిపిఐ నాయకులు తిప్పన ప్రసాద్ అన్నారు. చిట్వేలి సిపిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒకవైపు అకాల వర్షానికి పంట నష్టం, రైతు, కూలీ అల్లాడుతుంటే, మరోవైపు ఇంధన ధరలతో ప్రభుత్వాలు బాదుతున్నాయని అన్నారు. లీటర్ పెట్రోల్, డీజిల్ ధరలను మూడు రూపాయలు పెంచడంతో ఆటో, ట్రాక్టర్, లారీ నడిపేవారు అప్పుల పాలవుతున్నారని అన్నారు. ఇంటి ఖర్చులు రెట్టింపై పేద, మధ్యతరగతి కుటుంబాలు కుదేలవుతున్నాయి అన్నారు. బస్సు, కూరగాయలు, పాలు, ప్రతి వస్తువు ధర పెరిగి సామాన్యుడు బతకలేని పరిస్థితి తెచ్చారు అని అన్నారు. కేంద్రం ఎక్సైజ్ డ్యూటీ, రాష్ట్రం వ్యాట్ పేరుతో లీటరుకు 60 రూపాయలు దోచుకుంటున్నారని అన్నారు. ఈ దోపిడీ సొమ్ముతో అదానీ, అంబానీలకు రాయితీలు ఇస్తున్నారు తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదు అని అన్నారు. పేదవాడి కడుపు కొట్టి పెద్దల జేబులు నింపడమే ఈ ప్రభుత్వాల విధానం అన్నారు. తక్షణమే పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ జిఎస్టి పరిధిలోకి తెచ్చి 28 కి మించకుండా పన్ను నిర్ణయించాలని అన్నారు.

## పాఠశాలల ప్రారంభానికి ముందే స్మార్ట్ కిచెన్ సిద్ధం చేయాలి..!

- వేములలో స్మార్ట్ కిచెన్ నిర్మాణంపై అధికారులతో సమీక్షించిన డీఆర్‌డీఏ పీడీ రాజేశ్వరి
- విద్యార్థుల ఆరోగ్యానికి ఆధునిక సదుపాయాలతో కిచెన్ నిర్మాణం
- పనుల్లో నిర్లక్ష్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు




**వేముల మన జనప్రగతి మే 16:-** వేముల మండల కేంద్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న స్మార్ట్ కిచెన్ పనులను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ రాజేశ్వరి శనివారం ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షిస్తూ పంచాయతీరాజ్ ఇంజనీర్ అబ్దుల్లా, కాంట్రాక్టర్ ఓబుల్ రెడ్డి యాదవ్‌తో చర్చించి పలు సూచనలు చేశారు.అందులో భాగంగా డీఆర్‌డీఏ పీడీ రాజేశ్వరి మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరిశుభ్రమైన, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడంలో స్మార్ట్ కిచెన్లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆధునిక సాంకేతిక సౌకర్యాలతో ఈ కిచెన్‌ను నిర్మిస్తున్నదని పేర్కొన్నారు.నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా, నాణ్యతతో పాటు వేగాన్ని కూడా పెంచాలని కాంట్రాక్టర్‌కు స్పష్టం చేశారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయానికి అన్ని పనులు పూర్తిచేసి స్మార్ట్ కిచెన్‌ను వినియోగానికి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.విద్యుత్ సరఫరా,తాగునీటి సౌకర్యం,వంటశాల పరికరాల సమీకరణ, వ్యర్థాల నిర్వహణ,పరిశుభ్రత వంటి అంశాల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.వంట ప్రక్రియలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం కాపాడబడుతుందని పేర్కొన్నారు.అలాగే పనులు నిరంతరంగా సాగేందుకు తగిన కార్మికులు, అవసరమైన సామగ్రి సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ స్మార్ట్ కిచెన్ ప్రాజెక్టు ద్వారా విద్యార్థులకు మెరుగైన భోజన సదుపాయాలు అందుబాటులోకి రావడంతో పాటు పాఠశాలలపై నమ్మకం మరింత పెరుగుతుందని రాజేశ్వరి అన్నారు.ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఆంజనేయులు, జ్యోతి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మన
# జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి.. తెలుగు దినపత్రిక

17 -05-2026

## మహిళా రక్షణ,మత్తు రహిత సమాజమే లక్ష్యం: ఎస్ఐ శివకుమార్




**రామాపురం మన జనప్రగతి మే 16:-**మహిళా రక్షణ, మత్తు రహిత సమాజమే లక్ష్యంగా రామాపురం మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారంపోలీస్ అవగాహన సదస్సు నిర్వహించినట్లు రామాపురం ఎస్సై శివకుమార్ తెలిపారు ఈ సందర్భంగా పోలీస్ వారు గ్రామాల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ గృహహింస ,వరకట్నం తదితర అంశాలు మహిళలను హింసించిన గ్రామాల్లో మత్తుపదార్థాలు జూదం బెట్టింగులు కోడిపందాలు లాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన ఎంతటి వారైనా సరే కఠినంగా చటపకారం శిక్షించబడతారని తెలియజేశారు అలాంటి అసాంఘిక కార్యక్రమాలు మండలం లో ఎక్కడ జరిగిన వెంటనే పోలీసులకు తెలియపరచ వచ్చునని తెలియపరిచిన వారి పేర్లను పోలీసు వారు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేశారు సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రత్త వహించాలని తెలిపారు ప్రజలు పోలీస్ హెల్ప్ లైన్112, సైబర్ హెల్ప్ 19 30, గంజాయి హెల్ప్ లైన్ 1972, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి ఫ్రీగా కాల్ చేయవచ్చని తెలియజేశారు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిసినట్లయితే తెలియ పరచవలసిన ఫోన్ నెంబర్లు రామాపురం ఎస్ఐ ఫోన్ నెంబర్:-9121100558, సిఐ లక్కిరెడ్డిపల్లి:-9121100554, డి.ఎస్.పి:-9121100715, ఎస్పీ:-9154960160 కు కాల్ చేసి వివరములు తెలియపరచవలసిందిగా పోలీసులు విజ్ఞప్తి చేశారు

## సేవా కార్యక్రమాలతో ప్రజల్లో దీటైన నాయకుడిగా ఎదిగిన యల్లటూరు శ్రీనివాసరాజు

- కొమరా వెంకట నరసయ్య ప్రశంసలు



**ఒంటిమిట్ట మన జనప్రగతి మే 16:-** రాజంపేట జనసేన పార్లమెంట్ పార్టీ కన్వీనర్ యల్లటూరు శ్రీనివాసరాజు తన సేవా కార్యక్రమాలతో ఆరు మండలాల ప్రజల్లో దీటైన నాయకునిగా ముందుకెళు న్నారని రాష్ట్ర మాజీ కల్లుగీత కార్మిక సంఘం డైరెక్టర్, సీనియర్ నాయకులు కొమరా వెంకట నరసయ్య కొనియాడారు. ఆదివారం శ్రీనివాసరాజు జన్మదినం సందర్భంగా శనివారం ఒంటిమిట్ట హరిత హోటల్‌లో మండల టీడీపి సీనియర్ నాయకుడు మామిళ్ల ఈశ్వరయ్యతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీనివాసరాజుకు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఉన్నత ప్రభుత్వ అధికారిగా పనిచేసిన శ్రీనివాసరాజు, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో తన పదవికి రాజీనామా చేసి జనసేనలో చేరారని నరసయ్య గుర్తుచేశారు. అధికారులతో ఉన్న సత్సంబంధాలతో నియోజకవర్గ పరిధిలోని మారుమూల గ్రామాల్లో సైతం ఆయన అభివృద్ధి పనులు చేపడుతున్నారని ప్రశంసించారు. ఇప్పటికే రాజంపేట నియోజకవర్గంలో రూ. 8 కోట్ల నిధులతో సిమెంట్ రోడ్ల పనులు మంజూరు చేయించారని, త్వరలోనే మరో రూ. 3 కోట్లు మంజూరు కానున్నాయని తెలిపారు. ఉన్నత పదవిని వదిలి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న శ్రీనివాసరాజుకు ఒంటిమిట్ట మండల టీడీపి సీనియర్ నాయకులు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## దూరదర్శిని పల్లెటూరి జ్ఞాపకాలతో వినోదం

- 90ల పల్లెటూరి ప్రేమకథను గుర్తు చేసే ఫీల్ గుడ్ మూవీ
- రాయచోటిలో చిత్ర బృందానికి ఘన స్వాగతం, సత్కారం
- కుటుంబ విలువలు, చదువు ప్రాముఖ్యతను ప్రతిబింబించిన కథ



**అన్నమయ్య బ్యూరో మన జనప్రగతి మే 16:-** నేటి యాంత్రిక జీవనంలో కాసేపు మన మూలాలను గుర్తు చేసుకుంటూ హాయిగా నవ్వుకోవాలనుకునే ప్రతి ఒక్కరూ తప్పక చూడాల్సిన చిత్రంగా 'దూరదర్శిని' నిలుస్తుందని చిత్ర బృందం పేర్కొంది. ముఖ్యంగా యువతకు తమ తల్లిదండ్రుల కాలం నాటి జీవన విధానం ఎలా ఉండేదో పరిచయం చేసే మంచి అవకాశం ఈ సినిమా కల్పిస్తుందని తెలిపారు.అన్నమయ్య జిల్లా రాయచోటి ప్రసాద్ హాల్‌లో ప్రేక్షకులతో కలిసి చిత్ర బృందం సందడి చేసింది. ఈ సందర్భంగా అభిమానులు బాణాసంచాలు పేలుస్తూ ఘనంగా స్వాగతం పలికారు. హీరోతో ఫోటోలు దిగేందుకు చిన్నా పెద్దా ఉత్సాహంగా ముందుకు వచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ షేక్ మహమ్మద్ చిత్ర బృందాన్ని శాలువాతో సత్కరించారు.చిత్ర హీరో బొజ్జ సువిక్షత్ రెడ్డి, షేక్ మహమ్మద్, దేశిరెడ్డి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ 90వ దశకంలోని స్వచ్ఛమైన పల్లెటూరి ప్రేమకథను ఆధునిక కాలంలో ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందించామని తెలిపారు. గోదావరి జిల్లాల నేపథ్యంలో సాగే ఈ కథలో 'మట్టపరు' అనే గ్రామంలో కులమతాలకు అతీతంగా ప్రజలు ఎలా కలిసిమెలిసి జీవించేవారో సహజంగా చూపించామని చెప్పారు.ఈ చిత్రంలో ప్రేమకథతో పాటు చదువు ప్రాముఖ్యత, తల్లిదండ్రుల అనురాగం వంటి విలువలను కూడా ప్రతిబింబించామని పేర్కొన్నారు. పాత కాలం నాటి రేడియోలు, సైకిల్ ప్రయాణాలు, గ్రామంలో తొలిసారి టీవీ (దూరదర్శన్) ప్రవేశించినప్పుడు కలిగిన ఆనందాన్ని మళ్లీ గుర్తు చేసేలా సన్నివేశాలు రూపొందించామని వివరించారు.హీరో, హీరోయిన్‌లతో పాటు కమెడియన్ భద్రం, లావణ్య రెడ్డి తమ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారని తెలిపారు. దర్శకుడు కార్తికేయ కొమ్మి పల్లెటూరి వాతావరణాన్ని సహజంగా ఆవిష్కరించారని, వారాహ మూవీ మేకర్స్ పతాకంపై జయశంకర్ రెడ్డి, పాటిమీది సంతోష్ ఈ చిత్రాన్ని నిర్మించారని చెప్పారు.గోదావరి జిల్లాల పచ్చదనం, పాత ఇళ్ల అందం, మనుషుల మధ్య ఉన్న స్వచ్ఛమైన బంధాలు ఈ సినిమాకు ప్రధాన బలం అని పేర్కొన్నారు. "మీ చిన్ననాటి జ్ఞాపకాలను పలకరించే మధుర కావ్యం మన 'దూరదర్శిని'" అని చిత్ర బృందం తెలిపింది. భవిష్యత్తులో కూడా ఇలాంటి మంచి సినిమాలను అందించాలని ఆకాంక్షించారు.

## రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి: ఏపీ రైతు సంఘం



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి మే 16:-**శనివారం అన్నమయ్య జిల్లా పీలేరు మండలంలోని రైతుల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు, స్థానిక పరిస్థితులపై ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనార్ధన్, జిల్లా కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న పలు ప్రాంతాల్లో సమస్యలను తెలుసుకుని, రైతు సంఘం బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై నాయకులతో చర్చించామని తెలిపారు పీలేరు మండలంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సాగునీటి కొరత, ఎరువులువిత్తనాల ధరల పెరుగుదల, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, విద్యుత్ సమస్యలు, వ్యవసాయ రుణభారం రైతులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సబ్సిడీలు, పంట బీమా, నష్టపరిహారం సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే గ్రామ స్థాయిలో రైతు సంఘాన్ని మరింత బలోపేతం చేసి రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనార్ధన్, జిల్లా కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీపీఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ పాల్గొన్నారు.

## జూదం స్థావరాలపై పోలీసుల మెరుపు దాడులు

- రూ. 2.75 లక్షలు నగదు స్వాధీనం..8 మంది అరెస్ట్



**వేంపల్లె మన జనప్రగతి మే 16:-** మండలంలోని బక్కన్నగారిపల్లెలో జూదం ఆడుతున్న స్థావరాలపై పోలీసులు మెరుపుదాడులు చేసినట్లు డిఎస్పీ మురళి నాయక్ తెలిపారు. వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాబడిన సమాచారం మేరకు శనివారం బక్కన్నగారిపల్లెలోని జూదం ఆడుతున్న వారిపై దాడులు చేసి వారి వద్ద నుంచి రూ 2.75 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే 8 మందిని అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు పోలీసులకు అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. చట్టవ్యతిరేక పనులకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని వెల్లడించారు. వేంపల్లి సీఐ నరసింహులు, ఎస్ఐలు తిరుపాల్ నాయక్, తాహిర్ హుస్సేన్ లను డిఎస్పీ అభినందించారు.

## బస్సు కింద పడి బాలుడికి తీవ్ర గాయాలు

- సిద్దవటం మండలంలో విషాద ఘటన
- బస్సు ఎక్కే క్రమంలో ప్రమాదం
- బాలుడి కాలు నలిగిపోవడంతో ఆందోళన
- రిమ్స్‌కు తరలింపు..పోలీసుల కేసు నమోదు



**సిద్దవటం మన జనప్రగతి మే 16:-** మండలంలోని బాకరాపేట వద్ద శనివారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఆర్టీసీ అద్దె బస్సు కింద పడి ఓ బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది.స్థానికుల కథనం ప్రకారం, బెంగళూరు శ్రీరామ్ నగర్‌కు చెందిన కామాక్షి తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి సమీపంలోని నారాయణవనం నుండి రైలులో బాకరాపేటకు చేరుకున్నారు. అక్కడి నుంచి బ్రహ్మంగారిమఠం వెళ్లేందుకు బస్సు కోసం వేచి చూస్తున్నారు.ఈ సమయంలో బద్వేలు వైపు వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు (AP039 TD 8131) ఎక్కే క్రమంలో ప్రమాదం జరిగింది. కండక్టర్ మస్తాన్ గమనించకుండానే డ్రైవర్ మోహన్ కృష్ణ బస్సును ముందుకు కదిలించడంతో కామాక్షి కుమారుడు వినీత్ (10) ప్రమాదవశాత్తు బస్సు వెనుక టైర్ల కింద పడిపోయాడు.ఈ ప్రమాదంలో బాలుడి ఎడమ కాలు పూర్తిగా నలిగిపోయింది. ఘటనను చూసిన తల్లి కామాక్షి స్పృహ తప్పి కుప్పకూలింది. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా బాలుడిని మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.సిద్దవటం ఎస్సై హారిక ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వేంపల్లెలో కాంగ్రెస్ పార్టీ విన్నూత నిరసన



**వేంపల్లె మన జనప్రగతి మే 16:-** వేంపల్లెలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ ధరలు పెంచినందుకు నిరసనగా శనివారం పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు తాళ్లతో బైక్‌లను లాగుతూ వేంపల్లి రోడ్లపై కాంగ్రెస్ నేతలతో కలిసి పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి వినూత్న ప్రదర్శన చేశారు. మాజీ ఎంపీ తులసిరెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. మోటార్ బైక్‌లకు తాళ్లు కట్టి లాగుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈసందర్భంగా పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి, పులివెందుల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధృవకుమార్ రెడ్డిలు మాట్లాడుతూ ఇంధన ధరలను విపరీతంగా పెంచేసి సామాన్యుడి నడుం విరుస్తున్నారని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఇంధన ధరలు తగ్గించే వరకు కాంగ్రెస్ పార్టీ తరపున పోరాటాలు ఆపబోమని నేతల హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వేంపల్లిమండలాధ్యక్షులు రామకృష్ణ, కిసాన్ సెల్ నియోజకవర్గం కాంగ్రెస్ అద్యక్షులు బద్రీనాథ్ ,వేమయ్య,రవీంద్రనాథ్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిప్పన కుటుంబానికి అంజి అండ

- అంత్యక్రియలకు రూ.10వేలు సహాయం
- విషాదంలో కుటుంబానికి తోడుగా వైఎస్సార్సీపీ నేత



**దేవనకొండ మన జనప్రగతి మే 16:-** దేవనకొండ మండలం బోయచిగిలి గ్రామానికి చెందిన తిప్పన అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎస్సార్సీపీ యువ నాయకుడు ఎర్ర కోటి అంజి, బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. అంత్యక్రియల నిర్వహణకు రూ.10,000 నగదును అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఎర్ర కోటి అంజి మాట్లాడుతూ, ఇలాంటి విషాద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పార్టీ నాయకులు ఎప్పుడూ ప్రజల పక్షాన ఉండాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్సీపీ యువ నాయకులు, స్థానిక కార్యకర్తలు పాల్గొని మృతుడికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## శని జయంతి సందర్భంగా అగస్త్యేశ్వర ఆలయంలో విశేష పూజలు



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 16:-** శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానము లో శని జయంతి, శని అమావాస్య సందర్భంగా శనివారం ఉదయం భక్తి శ్రద్ధలతో విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడినవి. ఈ సందర్భంగా వందలాది మంది భక్తాదులు ఆలయానికి తరలివచ్చి శనీశ్వరునికి తైలాభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించి శని గ్రహ దోష నివారణకు ప్రార్థనలు చేశారు. భక్తులు శని గ్రహ అనుగ్రహం కలగాలని కోరుతూ భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి. రమణ,ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## కువైట్‌లో మినీ మహానాడు ఘనంగా నిర్వహణ





**అన్నమయ్య బ్యూరో మన జనప్రగతి మే 16:-** కువైట్‌లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో "మినీ మహానాడు" కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబును కువైట్ టీడీపీ నాయకులు,ప్రవాసాంధ్రులు, పార్టీ అభిమానులు ఘనంగా స్వాగతించారు.ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ, పరాయి దేశంలో ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీపై, అలాగే నాయకులు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్లపై ప్రవాసాంధ్రులకు ఉన్న నమ్మకం, అభిమానాన్ని అభినందించారు. వారి ఆదరణ తనను ఎంతో కదిలించిందని తెలిపారు.కువైట్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రవాస సోదరులు అందించిన ఘన స్వాగతానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.మనందరి లక్ష్యం తెలుగుజాతి సంక్షేమం నవ్యాంధ్ర ప్రగతే అని సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు.

## గ్రామసేవక్(గ్రీన్ అంబాసిడర్) సేవలు మరువలేనివి

**- కలెక్టర్ డాక్టర్ శ్రీ ధర్ చెరుకూరి, శాసనసభ్యులు పుత్రా కృష్ణ చైతన్య రెడ్డి**



**చెన్నూరు మన జనప్రగతి మే 16:-** స్వచ్ఛ సేవక్ లు (పారిశుద్ధ్య కార్మికులు) చేసే పని ఎంతో గౌరవమైన దని,వారు చేసే పనికి ప్రజలు సహకరించాలని, వారిని గౌరవిస్తూ గ్రామ సేవక్(గ్రీన్ అంబాసిడర్) విగ్రహం ను ఏర్పాటు చేయడం అభినందనీయని పంచాయతీ కార్యదర్శి రాజేష్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అభినందించారు.బయనపల్లి లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ను పూర్తి పచ్చదనంతో ఆహ్లాద కర వాతావరణం లో నిర్వహిస్తున్న గ్రామ సేవక్ హనుమంత్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రత్యేకంగా అభినందించారు.బయనపల్లి లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో పని చేస్తున్న స్వచ్ఛ సేవక్ లకు ప్రోత్సాహకంగా కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి రూ.10 వేలు నగదు ప్రోత్సాహకంగా అందజేస్తున్నట్లు ప్రకటించారు.

## నవరత్నాల పేరుతో ప్రజలను నయవంచన

**● తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్బాషా**



**వీరబల్లి మన జనప్రగతి మే 16:-**గత ప్రభుత్వంలో వైసీపీ నాయకుల అవినీతి దోపిడీ విధ్వంసం విపరీతంగా పెరిగింది కాబట్టే రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పారని గాజుల ఖాదర్బాషా పేర్కొన్నారు..శనివారం నాడు ఫోకస్ బూతుల పరిశీలనలో వీరబల్లె మండలంలో మండల అధ్యక్షుడు భాను ప్రకాష్ ఆధ్వర్యంలో గడికోట వీరబల్లి మండలాలలో తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం గాజుల ఖాదర్ బాషా మాట్లాడుతూ..వైసీపీ నాయకుల మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని చంద్రబాబు చేస్తున్నఅభివృద్ధి చూసి ఓర్వలేక ప్రభుత్వంపై పసలేని మాటలు మాట్లాడుతున్న జగన్మోహన్ రెడ్డికి మరియు వారి బ్యాచ్ కి ప్రజలు బుద్ధి చెప్పినా సిగ్గు రాలేదని తెలియజేశారు రాష్ట్రాన్ని గత వైసిపి ప్రభుత్వంలో అప్పుల ఆంధ్ర ప్రదేశ్ గా మార్చారని ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో ఆత్మస్థైర్యముతో రాష్ట్రాన్ని గట్టెక్కిస్తుంటే ప్రతిరోజు 18 గంటలు కష్టపడి రాష్ట్ర ప్రజల కోసం పనిచేస్తుంటే అది చూసి ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి విమర్శించడం సబబు కాదు అని తెలిపారు వీరబల్లి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడుతుందని వైసిపి పార్టీ భూస్థాపితం అవుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో వీరబల్లి మండల అధ్యక్షుడు భాను ప్రకాష్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రెడ్డప్ప అలీ చాంద్ బాషా మరియు బూత్ ఇంచార్జీలు యూనిట్ ఇంచార్జి లు పాల్గొన్నారు.

## ఘనంగా నల్ల పోచమ్మ ఆలయంలో శని హోమం



**హైదరాబాద్, మన జనప్రగతి మే 16:-** అమావాస్య, శని జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్, కోటి బ్యాంక్ స్ట్రీట్, రాణి పార్క్ సమీపంలో ఉన్న నల్ల పోచమ్మ ఆలయంలో శని హోమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9:00 గంటలకు శని దేవుని ఆశీస్సులు కోరుతూ పలువురు భక్తులు పాల్గొనడంతో శని హోమం ప్రారంభమైంది. అనంతరం, బజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణరావు మధ్యాహ్నం 12:30 గంటల నుండి అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానికుల నుండి అద్భుతమైన స్పందన లభించింది.కార్యక్రమాన్ని జయప్రదం చేసిన భక్తులు, వాలంటీర్లు, మద్దతుదారులందరికీ ఎన్.ఆర్. లక్ష్మణరావు ధన్యవాదాలు తెలియజేశారు.

## మందగిరి శనీశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

**● శని జయంతి,అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు**





**సిద్దవటం మన జనప్రగతి మే 16:-** మండలంలోని భాకరాపేట సమీపంలో వెలసిన ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ మందగిరి శనీశ్వరాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. శని దేవుని జయంతి మహోత్సవంతో పాటు, శనివారం అమావాస్య త్రయోదశి రావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ అరుదైన, అత్యంత పవిత్రమైన రోజున శనిదేవుడిని దర్శించుకుంటే ఏడు శనుల దోషాలు, గ్రహ పీడలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. క్యూలైన్లలో గంటల తరబడి..ఈ ప్రత్యేక పర్వదినాన్ని పురస్కరించుకొని వైఎస్ఆర్ కడప జిల్లా నలుమూలల నుంచే కాకుండా, పొరుగు జిల్లాల నుండి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. శనివారం తెల్లవారుజాము నుంచే ఆలయ పరిసరాలు భక్తుల రాకతో కోలాహలంగా మారాయి. ఉదయం నుంచే వేలాది మంది భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి, క్రమశిక్షణతో భక్తిశ్రద్ధలతో శనీశ్వరుని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి తెల్లవారుజామునే ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, మహామంగళహారతులు నిర్వహించారు. భక్తులు స్వామివారికి ఎంతో ప్రీతిపాత్రమైన నువ్వుల నూనెతో తైలాభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో నల్ల నువ్వులు, నల్లటి వస్త్రాలను సమర్పించి, ప్రమిదల్లో నీలి వత్తులు వేసి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

## ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్,డీజిల్ ధరల భారీ పెంపు ప్రజలపై భారం

**● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి**




**కడప మన జనప్రగతి మే 16:-**కడప డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.3కు పెంచడం ప్రజలపై మరింత ఆర్థిక భారం మోపినట్లేనని ఆమె విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఇంధన ధరల పెంపు ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచి ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వ వైఫల్యాల ఫలితమే ప్రజలు ఈ భారాన్ని మోయాల్సి వస్తోందని విజయ జ్యోతి ఆరోపించారు. 2024 పార్లమెంటు ఎన్నికలకు ముందు రూ.2 తగ్గింపు పేరుతో ప్రజలకు ఇచ్చిన ఉపశమనం ఇంకా పూర్తిగా అనుభూతి కాకముందే మళ్లీ భారీ పెంపు చేయడం ప్రజలను మోసం చేసినట్లేనని ఆమె అన్నారు. భవిష్యత్తులో మరిన్ని వసూళ్లకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు.ఇంధన ధరల పెంపు ప్రభుత్వ నాయకత్వ సంక్షోభానికి, పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని ఆమె వ్యాఖ్యానించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పెట్రోల్, డీజిల్ ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు.విలేకరుల సమావేశంలో కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య, దాసరి శ్రీనివాసులు, రఫీఖ్ ఖాన్, శీలం గంగయ్య ,షామీర్ హుస్సేన్ పాల్గొన్నారు

## మెడికవర్'లో అరుదైన శస్త్రచికిత్స

**● హైదరాబాద్,బెంగళూరు,చెన్నై తరహాలో వైద్యం**




**కాకినాడ మన జనప్రగతి మే 16:-**కాకినాడ మెడి కవర్ ఆసుపత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతం చేశారు. తలలోని రక్త నాళాలకు రక్తం గడ్డకట్టి ఉన్న వైద్యాన్ని తలకు ఎటువంటి గాయం చేయకుండా ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా వారు నిర్వహించారు. ఈ చికిత్సకు సంబంధించిన వివరాలను మెడికల్ ఆసుపత్రి సెంటర్ హెడ్ ఎన్ అంజిబాబు శనివారం ఆసుపత్రిలో విలేకరులకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల తిరగడం, బాధించడం ఎక్కువగా రావడంతో ఒకరు (పేరు గోప్యంగా ఉంచమని కోరారు) ఆసుపత్రికి వచ్చారన్నారు. దీనికి సంబంధించి ఆసుపత్రి న్యూరో విభాగానికి చెందిన వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించి (ఎండో వ్యాస్కులర్ సర్జరీ) శస్త్ర చికిత్స చేయాలని వారితో చెప్పారన్నారు. ఆ తర్వాత వారు బెంగుళూరు ఆస్పత్రులకు వెళ్లి వైద్యం పొందగా వారు కూడా తాము చెప్పిన పద్ధతిలోనే శస్త్ర చికిత్స చేయాలని చెప్పడంతో తిరిగి మెడి కవర్ ఆసుపత్రికి తీసుకు వచ్చారన్నారు.రోగికి అన్ని సిద్ధం చేసి (తొడ నుండి తలకు వైరు ద్వారా) ఇంటర్వెల్సివ్ రేడియాలజీ అనే పద్ధతిలో వైద్యం చేసినట్లు చెప్పారు. రోగి ఆరోగ్యంగా ఉన్నారని బిపి, గుండె పనితీరు బాగున్నట్లు అంజిబాబు చెప్పారు.ఈ తరహా వైద్యం హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై వంటి సిటీలలో ఉండేదని ప్రస్తుతం ఆ తరహా వైద్యం మెడి కవర్ ఆసుపత్రిలో అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో వైద్యులు లింగోలు చందు, కృష్ణ భాస్కర్, శ్రవణ్, అజయ్ రాకేష్, అరవింద్, రత్న మౌనిక, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంతో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

**● బయనపల్లి గ్రామంలో చెత్త నుండి సంపద కేంద్రం పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే**

**● పారిశుధ్య కార్మికుల విగ్రహ ఆవిష్కరణ, స్వచ్ఛ సేవకుల పనితీరుపై ప్రశంసలు**

**● ప్లాస్టిక్ రహిత గ్రామ లక్ష్యంతో స్వచ్ఛ రథం కార్యక్రమంపై అవగాహన**



**చెన్నూరు మన జనప్రగతి మే 16:-** రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతినెల మూడవ శనివారం ప్రాధాన్యతతో నిర్వహిస్తున్న "స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం ఈ నెల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం థీమ్‌తో చెన్నూరు మండలం బయనపల్లి గ్రామ పంచాయతీలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించిన వారు, పారిశుధ్య కార్మికుల విగ్రహాన్ని ఆవిష్కరించారు.అనంతరం స్వచ్ఛ సేవకులు గ్రామాల్లో చెత్త సేకరణ విధానం, వర్మీ కంపోస్ట్ తయారీ ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ప్లాస్టిక్ రహిత గ్రామంగా రూపుదిద్దే క్రమంలో స్వచ్ఛ రథం ద్వారా సేకరించే వ్యర్థాలకు బదులుగా నిత్యావసర వస్తువులు అందజేసే విధానాన్ని పరిశీలించారు.చెత్త నుండి సంపద తయారీ ప్రక్రియపై పంచాయతీ కార్యదర్శి సమగ్రంగా వివరించారు. అధికారులు ఈ కార్యక్రమాన్ని గ్రామస్థుల భాగస్వామ్యంతో మరింత విస్తరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుబ్రమణ్యం, డీపీఓ వెంకట సుబ్బయ్య, ఆర్డీవో చిన్నయ్య, జీఎస్‌డబ్ల్యూఎస్ డీడీఓ మైథిలీ, ఎంపీడీవో కిరణ్ మోహన్ రావు, డిప్యూటీ ఎంపీడీవోలు రామచంద్ర రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, తహసీల్దార్ విజయ కుమారి, ఎంఈఓ గంగిరెడ్డి, వ్యవసాయ అధికారి శ్రీదేవి, ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగరత్న, మండల టీడీపీ అధ్యక్షుడు కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఇంగిరెడ్డి శివారెడ్డి తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన విజయం సాధించడమే లక్ష్యం

**● రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ**



**సిద్దవటం మన జనప్రగతి మే 16:-** జనసేన పార్టీ సిద్ధాంతాలను, కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడంలో "జనసేన సాధక్"ల పాత్ర అత్యంత కీలకమని ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కొనియాడారు. మంగళగిరిలోని ఒక ప్రైవేట్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన "జనసేన సాధక్"ల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "జనసేన ఉద్యమి" సభ్యత్వాల నమోదు ప్రక్రియను విజయవంతం చేసి, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించిన సాధక్‌లను పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.ఈ ప్రతిష్టాత్మక ఆత్మీయ సమావేశంలో వైఎస్ఆర్ జిల్లా సిద్ధవటం మండలానికి చెందిన రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల ప్రాధాన్యతను పార్టీ శ్రేణులకు వివరించారు. అతికారి కృష్ణ తన ప్రసంగంలో, పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న ప్రతి ఒక్క కార్యకర్తను, సాధక్‌ను అభినందించారు. "జనసేన ఉద్యమి" సభ్యత్వ నమోదులో చూపిన చొరవను రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్ గారి ఆశయాలను, సిద్ధాంతాలను గడపగడపకూ చేరవేయడమే కాకుండా, ప్రస్తుతం ప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జనసేన పార్టీ అఖండ విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని అతికారి కృష్ణ స్పష్టం చేశారు. గ్రామ, మండల స్థాయిల్లో పార్టీ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేసి, ప్రతి ఒక్క ఓటరును ప్రసన్నం చేసుకోవాలని కోరారు. సాధక్‌లు అందించిన ఉత్సాహంతో, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కదిలితే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన పలువురు ముఖ్య నాయకులు, నియోజకవర్గాల సమన్వయకర్తలు మరియు పెద్ద సంఖ్యలో జనసేన సాధక్‌లు పాల్గొన్నారు.

## 23 నెలల పరిపాలనలో 19 నేషనల్ అవార్డులు అందుకున్న సేనాని

**● 19 నేషనల్ అవార్డులు అందుకున్న ఏకైక మంత్రి సేనాని అంటున్న జనసేన నాయకులు**



**వేంపల్లె మన జనప్రగతి మే 16:-** భారతదేశానికి స్వాతంత్రం వచ్చి దాదాపు 77 ఏళ్ల అయింది ఎంతోమంది ముఖ్యమంత్రులు వచ్చారు, కేంద్ర మంత్రులు వచ్చారు, మంత్రులు వచ్చారు, ఒక్క మంత్రికైనా ఇన్ని అవార్డులు వచ్చాయా కానీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు పంచాయతీరాజ్ శాఖ మంత్రి గా 23 నెలల కాలంలో 19 నేషనల్ అవార్డు రావడం గర్వించదగ్గ విషయం అని జనసేన పార్టీ నాయకులు గోసల ఆంజనేయులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పనితీరు ఎలా ఉంటుందో ఈ అవార్డులు బట్టే తెలుస్తుందన్నారు. 23 నెలల కాలంలో 19 నేషనల్ వార్డు వచ్చిన మంత్రిని ఒక్కరిని అంటే ఒక్కరిని చూపించండి అని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. మన రాష్ట్రం గర్వించదగ్గ నాయకుడు పవన్ కళ్యాణ్ అని అన్నారు.ఈయన మంత్రిగా ఇన్ని అవార్డులు వస్తే దీని కంటే గొప్ప స్థానంలోకి వెళితే మన రాష్ట్రం కానీ మన దేశం ఎంత పై స్థాయికి పోతుందో ప్రజలే తెలుసుకోవాలి అని జనసేన పార్టీ నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పెడపల్లి సుధీర్ రెడ్డి, పసుపులేటి శ్యామ్, దేవా, పట్టం ఉదయ్,మనోజ్ రెడ్డి,నితీష్ రెడ్డి, నాగేంద్ర,చొక్కం.మల్లికార్జున, నందా, థామస్, లక్ష్మణ్, ఇడుపులపాయి జై చంద్ర, అంజి తదితరులు పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
17 -05-2026

## అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవాన్ని విజయవంతం చేయండి

**మదనపల్లె మన జనప్రగతి మే 16:**–అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రమైన మదనపల్లిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లక్ష్మీ నరసయ్య, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి అధికారి డాక్టర్ రాధిక, జిల్లా క్లస్టర్ మేనేజర్ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు.మదనపల్లి జిల్లా ఆసుపత్రి నుండి సాయంత్రం 6 గంటలకు క్యాండిల్ లైట్ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. కొవ్వొత్తులు వెలిగించి మౌన ర్యాలీగా బెంగళూరు బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, ఎయిడ్స్ కారణంగా మరణించిన వారి ఆత్మశాంతి కోసం మౌనం పాటించి నివాళు లు అర్పించనున్నట్లు పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం మే మూడవ ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతోందన్నారు. కార్యక్రమానికి జిల్లా వైద్య అధికారులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో కూడా అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

## వైఎస్ఆర్ సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగ లోమడ రామాంజనేయ రెడ్డి



**చక్రాయపేట మన జనప్రగతి మే 16:–** మండలం కె.రాజుపల్లె గ్రామానికి చెందిన లోమడ రామాంజనేయరెడ్డి కి వైఎస్ఆర్సిపి లో అపూర్వ గౌరవం దక్కింది నన్ను నమ్మి నాకు పార్టీలో ఈ పదవి ఇచ్చినందుకు పార్టీ అధినేత జగనన్న కు కృతజ్ఞతలు తెలియ జే స్తున్నాను చక్రాయపేట మండల యూత్ కన్వీనర్ గా పార్టీ కోసం తాను కష్ట పడిన విషయం గుర్తించి జిల్లా యువజన విభాగం లో స్థానం కల్పించేందుకు కృషి చేసిన కడప పార్ల మెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి కి పులివెందుల ఇంచార్జి వైఎస్ భాస్కర్ రెడ్డి కి మండల ఇంచార్జి వైఎస్ కొండారెడ్డి కి వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి సతీ ష్ రెడ్డి కి హృదయ పూర్వక ధన్య వాదములు తెలియ జే యుచున్నాను. అలాగే త నకు సహకరిస్తు వచ్చిన మండల నాయకులు పార్టీ కార్యకర్తలు అభిమానులకు కూడా కృతజ్ఞతలు తెలి య జేస్తున్నాను. మీ అంద రి సహకారంతో పార్టీ అభి వృద్ధి కి నిరంతరం కృషి చేసి పూర్వ వైభవం తీసు కు వచ్చేందుకు కష్ట పడతానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మీడియాతో లోమడ రామాంజనేయరెడ్డి చెప్పారు

## కువైట్‌లో జనసేన ఆధ్వర్యంలో ఆత్మీయ విందు..ప్రవాసుల సమస్యలపై చర్చ



**అన్నమయ్య బ్యూరో మన జన ప్రగతి మే 16:**–కువైట్‌లో జనసేన పార్టీ కువైట్ కార్యవర్గం ఆధ్వర్యంలో ఆత్మీయ విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. మినీ మహానాడు కార్యక్రమానికి విచ్చేసిన విశిష్ట అతిథులను సత్కరిస్తూ ఈ విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, ఏపీ ఎస్.ఏ.ఏ.పి ఛైర్మన్ రవి నాయుడు, రాజంపేట పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు, సుండుపల్లి మండలం టీడీపీ అధ్యక్షుడు రమేష్ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ టీడీపీ గల్ఫ్ కౌన్సిల్ సభ్యుడు కోడూరి వెంకట్, జనసేన పార్టీ కువైట్ టీం అధ్యక్షుడు యర్రంశెట్టి హరిబాబు తదితరులు అతిథులను మర్యాదపూర్వకంగా కలిసి గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న ప్రవాసుల సమస్యలపై పలు ముఖ్య అంశాలను చర్చించారు.ప్రవాసుల సమస్యల పరిష్కారానికి తాము పూర్తి సహకారం అందిస్తామని అతిథులు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కువైట్ టీం సభ్యులు, యువజన విభాగం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ



**తిరుపతి మన జనప్రగతి మే 16** :"జాతీయ డెంగ్యూ దినోత్సవం" సందర్భంగా తిరుపతి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి బాలకృష్ణ నాయక్ అధ్యక్షతన జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జి కె రూప్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుండి శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి బాల కృష్ణ నాయక్ జండా ఊపి ప్రారంభించారు. డెంగ్యూ వ్యతిరేక నినాదాలతో ర్యాలీ నిర్వహించి శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వద్ద శ్రీ పద్మావతమ్మ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది మరియు విద్యార్థినులు " మానవహారం నిర్మించి నినాదాలు చేశారు. విద్యార్థినులు, సిబ్బంది మరియు జిల్లా అధికారులతో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డెంగ్యూ వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి నిర్మూలన కొరకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని తెలిపారు. డెంగ్యూ వ్యాధిఈడిస్ ఈజిప్టై అనే దోమ కాటు వలన వస్తుందని, ఈ వ్యాధి వర్షాకాలంలో ఎక్కువగా వస్తుందని, ఈ వ్యాధి నియంత్రణకు ప్రజలందరూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వాడి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు కొబ్బరి బోండాలు ప్లాస్టిక్ వస్తువులు ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలని, దోమలు కుట్టకుండా చూసుకోవాలని, ఇంటి కిటికీలకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలని,దోమల బ్యాట్లు రిపలెంట్లు వాడాలని,పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్ , డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డిపిఎమ్ఓ డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి, ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రెడ్డి ప్రసాద్, స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్ర కుమార్, డిప్యూటీ డెమో బలరామరాజు, జిల్లా ప్రోగ్రాం అధికారులు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, MPHEOలు,పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు,( మగ, ఆడ), కార్యాలయ సిబ్బంది, మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంజాయి బారి నుండి తిరుపతిని రక్షించుకుందాం!

- భూమన కుటుంబం నుండి యువతనుకాపాడుకుందాం
- గంజాయికి వ్యతిరేకంగా ఉద్యమించిన మహిళలు!




**తిరుపతి మన జనప్రగతి మే 16:–** ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో యువత జీవితాన్ని నాశనం చేస్తున్న గంజాయి కి వ్యతిరేకంగా తిరుపతి కూటమి పార్టీల మహిళా విభాగాల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో మహిళలు ఉద్యమించారు. శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట శాంతియుత నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా తెలుగుదేశం, జనసేన కు చెందిన పలువురు మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ భూమన కరుణాకర్ రెడ్డి, అయన కుమారుడు అభినయ్ రెడ్డి ల కనుసన్నలో కొట్లాది రూపాయల గంజాయి వ్యాపారం జరుగుతుందన్నారు.నాలుగు రోజుల క్రితం భూమన అభినయ్ రెడ్డి ప్రధాన అనుచరుడు భాను ప్రకాష్ తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి అమ్ముతూ.. ఆరు కేజీల గంజాయితో పట్టుబడడమే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యమన్నారు.ఒరిస్సా నుండి వందల కేజీల గంజాయి తెప్పించి పవిత్రమైన తిరుపతిలో అభినయ్ రెడ్డి తన అనుచరుల ద్వారా బస్టాండు రైల్వే స్టేషన్ కాలేజీలు చివరికి స్కూల్ ల వద్ద కూడా గంజాయిఅమ్మిస్తూకోట్లాది రూపాయలుసంపాదిస్తున్నారన్నారు.. ఈ గంజాయి వలన యువతీ యువకులు తమ జీవితాలను కోల్పోతున్నారని.. వారి తల్లి, తండ్రులు మరియు కుటుంబాలు తీవ్రమైన మానసిక క్షోభ అనుభవిస్తున్నాయన్నారు. భూమన కుటుంబం తమ అక్రమ సంపాదన కోసం బిడ్డల జీవితాలను సైతం నాశనం చేయడానికి సిద్ధపడిన ఈ తండ్రి కొడుకులను తిరుపతి నుండి వెలివేయాలని వారు డిమాండ్ చేశారు.గంజాయి వ్యాపారం చేయిస్తున్న భూమన అభినయ్ రెడ్డిపై అతని అనుచరులపై కేసు నమోదు చేయాలని.ఈస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు..ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ రాష్ట కార్యదర్శి కుమారమ్మా, పార్లమెంట్ సెక్రటరీ రేవతి..జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అకేపాటి సుభాషిణి, టిడిపి నగర మహిళా విభాగం అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ.. ఇతర మహిళా నాయకులతో పాటు.నగరానికి చెందిన పలువురు మహిళలు భారీ సంఖ్యలో ..పాల్గొన్నారు

## నిరుపేద మహిళలకు రోటరీ క్లబ్ చేయూత

- ఉచిత కుట్టు మిషన్ల పంపిణీతో మహిళా సాధికారతకు బాట



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 16:–** స్థానిక రోటరీ క్లబ్ సభా భవనంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు రొటేరియన్ పీహెచ్ఎఫ్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో నిరుపేద మహిళలకు 10 ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.రోటరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో,3160 రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.కే. రవీంద్ర సహకారంతో మహిళా సాధికారత కోసం ఈ కుట్టు మిషన్లు అందజేయబడ్డాయి. లబ్ధిదారులుగా అండ్లగుత్తి సునీత, గిడ్డంగి సోనియా, మంగరాజు కళావతి, ఆకుమల్ల రూతు, ఎద్దుల శిల్ప, బొమ్మిశెట్టి లక్ష్మీదేవి, ఇల్లూరి శివమ్మ, మున్నంగి అమ్ము, పీఎస్ గురమ్మ, పోతుపిల్లి లలితలకు కుట్టు మిషన్లు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా గజ్జల వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ, నిరుపేద మహిళలు స్వావలంబనతో ఆర్థికంగా ఎదిగి కుటుంబ పోషణలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పీడీజీ ఎంవీఎన్ ప్రభు, సీనియర్ రొటేరియన్ కొవ్వూరు రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రోటరీ ఇంటర్నేషనల్ విద్య, వైద్య, సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. పాఠశాలల నిర్మాణం, సైకిళ్లు, డెస్కులు, పుస్తకాల పంపిణీతో పాటు రోటరీ కంటి ఆసుపత్రి ద్వారా అందుతున్న వైద్య సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. వైస్ ప్రెసిడెంట్ గండ్లూరు శ్రీధర శర్మ మాట్లాడుతూ, రోటరీ ఫండ్ సభ్యత్వ విరాళాలు మరియు టీఆర్ఎఫ్ ద్వారా సమకూరుతుందని, ఆ నిధులను ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని తెలిపారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ ద్వారా వచ్చిన ఈ కుట్టు మిషన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మాస్టర్ ఆఫ్ సెర్మనీ బేపారి జాకీర్ అహ్మద్ మాట్లాడుతూ, మహిళలు ఈ కుట్టు మిషన్లను వినియోగించి కుటుంబ అభివృద్ధికి తోడ్పడాలని, అప్పుడే సేవా కార్యక్రమానికి సార్థకత లభిస్తుందని అన్నారు.

## స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ



**తిరుపతి మన జనప్రగతి మే 16:–** స్వర్ణాంధ్ర స్వచ్యాంధ్ర కార్యక్రమాన్ని ఈరోజు డీఎంహెచ్వో కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి బాలకృష్ణ నాయక్ గారు మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి "రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా"తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఒకసారి వాడి పడేసిన ప్లాస్టిక్ కవర్లు, బ్యాగుల వల్ల పర్యావరణం దెబ్బతినడం, మనుషులకు, జంతువులకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ విషయమై ప్రజలలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ బ్యాగుల స్థానంలో పేపర్ బ్యాగులు, బట్టతో చేసిన బ్యాగులు, వాడాలని,రహదారులు, త్రాగునీటి వనరులు, కుంటలు, నదులు, సరస్సులు, బీచ్ లు టూరిస్ట్ ప్రాంతాలు, పార్కులు, ఆసుపత్రులు, పాఠశాలలో మొదలైన వాటిని ప్లాస్టిక్ రహితంగా ఉండేటట్లు చూడా లన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమా లు చేపట్టాలని, కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలన్నారు. అనంతరం ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కొరకు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి,డిపిఎమ్ఓ డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి, ఇతర జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం

- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి:

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్



**తిరుపతి మన జనప్రగతి మే 16:–** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ఉదయం ఏర్పేడు బస్టాండు కూడలిలో మండలంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రతిజ్ఞ చేసి ప్రజలకు, స్థానిక అధికారులకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ సంచులు, ఒకసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వినియోగం పర్యావరణానికి తీవ్ర హానికరమని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా భూమి, నీరు, గాలి కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. పర్యావరణ హిత జీవనశైలిని అలవాటు చేసుకోవాలని సూచిస్తూ గుడ్డ సంచులు, జూట్ బ్యాగులు, పునర్వినియోగ వస్తువులను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఇంటి వద్ద నుంచే చెత్త వేర్వేరుగా వర్గీకరించి ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్త బుట్టల్లో వేయాలని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ తిరుపతి కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహిస్తూ ప్రజల్లో పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన పర్యావరణాన్ని అందించేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, తహసీల్దార్, ఎంపిడిఓ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల వైఎస్సార్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలించిన శాప్ బోర్డు మెంబర్ రజనీ




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 16:–** పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ స్పోర్ట్స్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌ను,హాకీ క్రీడా మైదానాన్ని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) బోర్డు మెంబర్ రజనీ శనివారం సందర్శించి,పరిశీలించారు. ముం దుగా వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీ బిల్డింగ్‌ను,హాకీ మైదానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆమె,అక్కడ శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో కొద్దిసేపు ముచ్చటించారు.క్రీడా సదుపాయాలు,వారికి అందుతున్న శిక్షణ వివరాలను అడిగి తెలుసుకున్నారు.శాప్ బోర్డు మెంబర్ రజనీ గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమై,ప్రస్తుతం నిలిచిపోయిన వైఎస్సార్ స్పోర్ట్స్ అకాడమీ బిల్డింగ్ పనులపై ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు రజనీ గారు స్పందించారు.రాష్ట్రంలో నిలిచిపోయిన హాకీ అకాడమీ బిల్డింగులను ప్రాధాన్యత క్రమంలో విడతలవారీగా ప్రారంభిస్తూ వస్తున్నామని ఆమె తెలిపారు. ఇందులో భాగంగానే రెండవ విడత (సెకండ్ ఫేజ్) లో పులివెందుల హాకీ అకాడమీ బిల్డింగ్‌ను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.త్వరలోనే ఈ అకాడమీని క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి,అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.ఈ పర్యటనలో కడప జిల్లా క్రీడాధికారి గౌస్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ సూపర్ వైజర్ మరియు బ్యాడ్మింటన్ కోచ్ యేసుదాసు,హాకీ కోచ్ రవికుమార్ తదితర క్రీడా శాఖ అధికారులు పాల్గొన్నారు.



# స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రతో గ్రామాల సమగ్ర పారిశుధ్యం

**● ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యం: కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ● పారిశుధ్యంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి: ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి**



**చెన్నూరు మన జనప్రగతి మే 16:-** స్వచ్ఛత కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ తమ కుటుంబ ఆరోగ్య క్షేమం కోసం భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చెన్నూరు మండలం బయనపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో పారిశుధ్యంపై ప్రజల్లో నిరంతర అవగాహన పెరుగుతోందన్నారు. ప్రతి నెల నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఒక్క రోజుకే పరిమితం చేయకుండా నిరంతర ప్రక్రియగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. గత 14 నెలల్లో జిల్లాలో పారిశుధ్యం గణనీయంగా మెరుగుపడిందని తెలిపారు. ప్రతి ఇంటా తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించడం, వాటిని వర్మీ కంపోస్ట్‌గా మార్చి వ్యవసాయానికి ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. చెత్త నుంచి సంపద సృష్టించే రంగం దేశవ్యాప్తంగా వేల కోట్ల రూపాయల వ్యాపారంగా మారిందని పేర్కొన్నారు.ప్లాస్టిక్ వినియోగంపై ఆందోళన వ్యక్తం చేసిన కలెక్టర్, గతంలో ఏడాదికి 23 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండగా, ఇప్పుడు నెలకు 56 కిలోలు పెరిగాయని తెలిపారు. ప్లాస్టిక్ దుర్వినియోగం వల్ల పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యం కూడా ప్రమాదంలో పడుతోందని హెచ్చరించారు. వ్యవసాయంలో ఉపయోగించే మల్చింగ్ షీట్లు, డ్రిప్ పైపులు సక్రమంగా రీసైక్లింగ్‌కు పంపాలని రైతులకు సూచించారు. భూమిలో మైక్రో ప్లాస్టిక్స్ చేరడం వల్ల అవి ఆహారంలోకి చేరి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు.ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ "స్వచ్ఛ గ్రామం స్వర్ణ గ్రామం" లక్ష్యంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని కోరారు. ఇంటిని ఎలా చూసుకుంటామో, ఊరిని కూడా అలానే చూసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించకపోతే క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతాయని హెచ్చరించారు. హోటళ్లలో ప్లాస్టిక్ డబ్బాలు, కప్పులు వాడకాన్ని తగ్గించి, స్వంత పాత్రలు ఉపయోగించాలని సూచించారు.మండలంలో గ్రీన్ అంబాసిడర్లతో కలిసి "ఫుల్ డీప్ క్లీనింగ్" కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో చెత్త కుప్పలు లేకుండా చేయడం పంచాయతీ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. రోడ్లపై నీళ్లు వదిలే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో గ్రీన్ అంబాసిడర్ల సేవలను ఎమ్మెల్యే అభినందిస్తూ రూ.10,000 నగదు బహుమతి ప్రకటించారు. వారిని గౌరవించడం అంటే చెత్త వేయకుండా, పరిశుభ్రత పాటించడం ద్వారానే సాధ్యమని తెలిపారు.గ్రామంలో అభివృద్ధి చేసిన స్వచ్ఛ పార్క్‌ను కలెక్టర్, ఎమ్మెల్యే అభినందించారు. ఇతర గ్రామాలు కూడా దీనిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కలిసి పరిశుభ్రతను కాపాడేందుకు, ప్లాస్టిక్ రహిత పర్యావరణాన్ని నిర్మించేందుకు ప్రతిజ్ఞ చేశారు.జెడ్పీ సీఈఓ సుబ్రమణ్యం, డీపీఓ వెంకటసుబ్బయ్య, ఆర్డీవో చిన్నయ్య, డీడీఓ మైథిలీ, ఎంపీడీఓ కిరణ్ మోహన్ రావు, తహసీల్దార్ విజయకుమారి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పులివెందులలో 'స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమం

**● ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చడమే ధ్యేయం: మున్సిపల్ కమిషనర్ సి.ముని కుమార్**




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 16:-** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర' ప్రోగ్రాంలో భాగంగా శనివారం పులివెందుల పురపాలక సంఘం పరిధిలో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మున్సిపల్ కమిషనర్ సి.ముని కుమార్ ఆధ్వర్యంలో స్థానిక కూరగాయల మార్కెట్ నందు ప్లాస్టిక్ రహిత రాష్ట్రంపై ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా కమిషనర్ ముని కుమార్ మార్కెట్లోని దుకాణదారులకు,ప్రజలకు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరించారు.ప్రజలందరూ ఇళ్ల నుంచి బజారుకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా గుడ్డ సంచిని వెంట తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా తీసుకున్నప్పుడే ప్లాస్టిక్ నిషేధం పూర్తిగా సాధ్యమవుతుందని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించే దుకాణదారులపై భారీ జరిమానాలు విధించడమే కాకుండా,వారి వ్యాపార లైసెన్సులను కూడా రద్దు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు,ప్లాస్టిక్ నిర్మూలనకు కట్టుబడి ఉంటామని మార్కెట్ ప్రాంగణంలో ఉన్న వారందరితో కమిషనర్ స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మహబూబ్ బాషా, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అజయ్,మున్సిపల్ మరియు సచివాలయ సిబ్బంది,మెప్మా ప్రతినిధులు, స్థానిక దుకాణదారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## షికారు పాలెంలో విస్తృత కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**అక్రమ మద్యం స్వాధీనం..**

**పోలీసుల కట్టుదిట్టమైన చర్యలు**






**రాజంపేట మన జనప్రగతి మే 16:-**జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు రాజంపేట సబ్ డివిజన్ పరిధిలోని వీరబల్లి పోలీస్ స్టేషన్ ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం శనివారం ఉదయం విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. టీ. సుండుపల్లి సర్కిల్ సీఐ ఎ.పి మస్తాన్ ఆధ్వర్యంలో షికారు పాలెం గ్రామంలో ఈ కార్యక్రమం చేపట్టారు.'ఆపరేషన్ వజ్రప్రహార్'లో భాగంగా నిర్వహించిన ఈ తనిఖీల్లో బెల్ట్ షాప్‌లో అక్రమంగా విక్రయిస్తున్న 13 బీర్ బాటిళ్లు, 7 క్వార్టర్ మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, పాత కేసుల నిందితులపై ప్రత్యేక నిఘా ఉంచుతూ ఇళ్లలో మరియు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి గ్రామ ప్రజలతో సమావేశమై అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకం తప్పనిసరి చేయాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అలాగే మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై వివరించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 112కు సమాచారం ఇవ్వాలని కోరారు.పాత కేసుల నిందితులతో సమావేశమై సత్ప్రవర్తనతో మెలగాలని సూచిస్తూ, గ్రామంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలను కఠినంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. చిన్న సమస్యలైనా పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో సీఐ ఎ.పి మస్తాన్‌తో పాటు వీరబల్లి ఎస్ఐ సుష్మిత, టీ. సుండుపల్లి ఎస్ఐ హుస్సేన్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ భూతాన్ని తరిమి భవితరాలకు ఆరోగ్యానిద్దాం: మంత్రి సవిత



**పెనుకొండ/శ్రీసత్యసాయి మన జనప్రగతి మే 16:-** మన ఇంటి నుంచి, మన గ్రామ నుంచి ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దామని, కాలుష్యాన్ని నివారించి, భావితరాలకు ఆస్తులే కాదు ఆరోగ్యాన్ని కూడా ఇద్దామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ కవర్లను, వస్తువుల వాడాకానికి దూరంగా ఉండాలని అన్నారు. చెత్త మీద పన్ను రద్దు చేసి, అదే చెత్తతో సంపద సృష్టిస్తున్న ఘనత సీఎం చంద్రబాబునాయుడిదన్నారు. పెనుకొండ పట్టణంలోని గాంధీ సర్కిల్ లో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. స్వచ్ఛంధ్ర – స్వర్ణాంధ్ర కోసం సీఎం చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్యానికి, గ్రామాల్లో పరిశుభ్రతకు సీఎం చంద్రబాబు ప్రాధాన్యమిస్తూ స్వచ్ఛంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో అటు ఆరోగ్యం, ఇటు పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోందన్నారు. ఇళ్లోకి, గ్రామాల్లోకి ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు రాకుండా చేయడంలో మహిళలే కీలకమన్నారు. మన భావితరాలకు ఆస్తులతో ఆరోగ్యాన్ని కూడా ఇవ్వాలని పిలుపునిచ్చారు. గత పాలకులు చెత్త మీద పన్ను వేసి, ప్రజలపై ఆర్థిక భారంగా మోపారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే చెత్త పన్ను రద్దు చేసి, అదే చెత్త ద్వారా సంపద సృష్టిస్తున్నారన్నారు. చెత్తతో వర్మీ కంపోస్ట్, ఇతర సేంద్రీయ ఎరువులను తయారు చేస్తున్నారన్నారు. స్వచ్ఛ రథాల ద్వారా ప్లాస్టిక్, ఇనుము, ఇతర వ్యర్థాలు సేకరించి, ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నారన్నారని మంత్రి సవిత తెలిపారు. ప్రజలంతా ప్లాస్టిక్ నివారణకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి షాపు వద్ద మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను తెలిపే ప్లేక్సీలు, స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని మంత్రి సవిత ఆదేశించారు.**ప్రకృతి వ్యవసాయంతో మేలు** క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక రోగాలతో మనుషుల ప్రాణాల పోవడంలో ప్లాస్టిక్ తో పాటు అతిగా ఎరువుల వాడకం కూడా కారణమని మంత్రి సవిత తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలుగుతుందన్నారు. ప్రభుత్వం సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సాహిస్తోందన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెట్ మంచి డిమాండ్ ఉందని, తద్వారా అధిక లాభాలు ఆర్జించాలని ఆకాంక్షించారు. జంక్ ఫుడ్ కారణంగా క్యాన్సర్ వ్యాపిస్తోందని, తల్లిదండ్రులు తమ బిడ్డలను ఇటువంటి ఆహార పదార్థాలకు దూరంగా ఉంచాలని మంత్రి సవిత సూచించారు. చెత్తను ఎక్కడి పడితే అక్కడ పడేయకుండా, ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలన్నారు. స్వచ్ఛ పెనుకొండ బాధ్యత పట్టణ ప్రజలందరిదీనని స్పష్టంచేశారు. అనంతరం గాంధీ సర్కిల్ లో మానవ హారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉంటామని మానవ హారంలో పాల్గొన్నవారితో మంత్రి సవిత ప్రతిజ్ఞ చేయించారు.**నడిచి... రోడ్డుపై చెత్త ఏరివేసి...** నా దేశం – నా బాధ్యత కింద ప్రతి ఒక్కరూ పొదుపు మంత్రం పాటించాలని పిలుపునిచ్చిన సీఎం చంద్రబాబు మాటలను మంత్రి తూచ తప్పకుండా పాటించారు. పెనుకొండ పట్టణంలోని గాంధీ సర్కిల్ లో నిర్వహించిన స్వచ్ఛంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రి సవిత తన క్యాంపు కార్యాలయం నుంచి నడుచుకుంటూ వెళ్లి పాల్గొన్నారు. ఎటువంటి వాహన శ్రేణిని వినియోగిం చకుండా, మంత్రి సవిత పాల్గోన డంపై సర్వత్రా అభినందనలు వ్యక్తమయ్యాయి. అంతకుముందు పట్టణంలోని షాపులు, తోపుడు బండ్ల వద్దకు గుడ్డతో తయారు చేసిన క్యారీ బ్యాగ్ లను అందజేశారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు కాటన్ వస్త్రాలతో తయారు చేసిన క్యారీ బ్యాగులివ్వాలని సూచించారు. షాపుల ఎదుట పడివున్న చెత్తను మంత్రి సవిత స్వయంగా తీసి, డస్ట్ బిన్ లో వేశారు. ఈ కార్యక్ర మంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వెటరన్ జర్నలిస్టులకు పెన్షన్, ఇళ్ల స్థలాల కోసం వినతి

**● 60 ఏళ్లు దాటిన జర్నలిస్టుల సమస్యలపై కలెక్టర్, ఎమ్మెల్యేకు వినతిపత్రం**

**● ఇతర రాష్ట్రాల మాదిరిగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్**

**● ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్,ఎమ్మెల్యే హామీ**



**చెన్నూరు మన జనప్రగతి మే 16:-** రాష్ట్రవ్యాప్తంగా 60 సంవత్సరాలు దాటిన వెటరన్ జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం మరియు ఇళ్ల స్థలాల మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మరియు కమలాపురం శాసనసభ్యుడు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డిలకు వినతిపత్రం సమర్పించారు.శనివారం చెన్నూరు మండలం బయనపల్లె (కొండపేట) గ్రామంలో నిర్వహించిన "స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలను వెటరన్ జర్నలిస్టులు నాన్యంపల్లి గోపాలకృష్ణ, చీర్ల చెన్నయ్య కలిసి సమస్యలను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 900 మంది, వైఎస్సార్ కడప జిల్లాలో 22 మంది 60 ఏళ్లు దాటిన జర్నలిస్టులు ఉన్నారని తెలిపారు.ఇతర రాష్ట్రాల్లో జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తున్నట్లే, ఆంధ్రప్రదేశ్‌లో కూడా వెటరన్ జర్నలిస్టులకు పెన్షన్‌తో పాటు ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు కోరారు.దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అందరికీ మేలు చేసే విధంగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174